# మంచి విద్యను అందించడానికి ఓ స్కూలు ప్రయత్నం

అభ్యాసవిద్యాలయం
విజయవాడ

# ముందుమాట

మంచివిద్య అంటే ఏమిటి?

ఏ విద్య అయితే ఇంతవరకు అందిన జ్ఞానాన్ని విద్యార్థులకు అందజేస్తూ, దానిపై ఆధారపడి నూతన ఆలోచనలకు, ఆవిష్కరణలకు అవగాహనకు తోడ్పడేదిగా ఉంటుందో ఆ విద్య మంచి విద్య అని విజ్ఞుల అభిప్రాయం.

అంటే ఉపాధ్యాయుల బోధనాపద్ధతులలో, విద్యార్థుల అభ్యసన క్రమంలో ఉన్న సమాచారాన్ని అందజేయడం, అందుకోవడంతోపాటు సృజనాత్మకతకు అవకాశం ఉన్నప్పుడే విద్య సత్ఫలితాలనిస్తుంది. అందుకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి చేసే కృషిలో ఈ అధ్యయన, అభ్యసనా పద్ధతుల ప్రాముఖ్యం ప్రయోజనం విలువైనవి. ఈ నిరంతర కృషిలో విద్యార్థి కేంద్రంగా అనుసరించే బోధనాపద్ధతులలో ఎప్పటికప్పుడు ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను సకాలంలో గుర్తించి సానుకూలంగా పరిష్కరించు కోవడానికి స్వేచ్ఛాయుతమైన సమిష్టి కృషి అవశ్యం వాంఛనీయం. తరచు తల్లితండ్రులు తమ ఉపాధ్యాయుల మధ్య విద్యార్థి పురోగతిపై నిష్పాక్షికమైన చర్చలు, నిర్మొహమాటమైన సమీక్షలు జరపడం విద్యార్థి భవిష్యత్తుకు దోహదకారి అవుతుంది. అభ్యాసవిద్యాలయంలో ఇందుకు అనుగుణంగా కలిసి మాట్లాడుకుందాం అనే ప్రాయోగిక కార్యక్రమం ఒక సానుకూల అంశం. ఏదైనా ఒత్తిడి లేకుండా, భయం లేకుండా విద్యార్థి నేర్చుకోవడాన్ని ప్రోత్సహించే విద్యాబోధనా పద్ధతులు రెండు దశాబ్దాలుగా అమలు చేస్తూ వచ్చిన క్రమాన్ని వివరించే చిన్న పుస్తకమిది. విద్యావ్యవస్థలో ఆసక్తి, భాగస్వామ్యం కలవారందరినీ ఆలోచింపజేసే చిరు ప్రయత్నం.

**చక్రవర్తుల రాఘవాచారి**

*విశాలాంధ్ర పూర్వ సంపాదకులు*

# అభ్యాస విద్యాలయం గురించి మీకు తెలుసా?



**వి**ద్య నేర్చుకోవడం ప్రతి పిల్లవాడి హక్కు. విద్యను నిజమైన స్ఫూర్తిలో పిల్లలకు అందించడం విద్యాసంస్థల బాధ్యత. పిల్లలకు మంచి విద్యను అందించే ఆశయంతో 1993లో అభ్యాసవిద్యాలయాన్ని స్థాపించారు. 1995లో ఏర్పడ్డ దీప మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ అభ్యాస విద్యాలయం నిర్వహణాబాధ్యతలను తీసుకుంది. ఎస్.సి.ఈ.ఆర్.టి. సిలబస్‌ను 6 ఆ పై తరగతులలో అనుసరిస్తున్నాం. 10వ తరగతి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు వుంది.

ఆకాశపు నీలం, చెట్ల పచ్చదనం అద్దినట్లుండే గుణదల కొండ మీద, రణగొణ ధ్వనులకు, కాలుష్యానికి దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో పిల్లలు నేర్చుకునేందుకు సహజసిద్ధమైన స్పందనలనిస్తుంది అభ్యాస విద్యాలయం.

**అభ్యాస విద్యాలయంలో విద్య ఎలా ఉంటుంది?**

అభ్యాస విద్యాలయం పిల్లలకు మంచివిద్యను అందించడానికి ఉంది. మంచివిద్య అంటే... విలువలతో కూడినది. పిల్లలను స్వతంత్రుల్ని చేసేందుకు దోహదపడేది.

తమ ఆసక్తులను, అభిరుచులను, బలాలను తెలుసుకునేందుకు, వాటిని మెరుగు పరుచుకునేందుకు అవకాశాలు కల్పించేది. పిల్లల సహజమైన కుతూహలాన్ని సజీవంగా ఉంచేది. వారి బాల్యానందాలను హరించనిది. వారు ఆరోగ్యంగా, సంతోషంగా, బాధ్యతాయుతంగా ఎదిగేందుకు సహాయపడేది. అటువంటి విద్యను పిల్లలకు అందించేందుకు అభ్యాస విద్యాలయం కట్టుబడి ఉంది. అందుకు శిశు కేంద్రిత విద్యా ప్రణాళికను, కృత్యాల ద్వారా అర్థవంతంగా విషయాన్ని గ్రహించేందుకు ప్రోత్సహించే బోధనా పద్ధతులను రూపొందించుకుని అనుభవాలనుబట్టి వాటిలో మార్పులు, చేర్పులు చేసుకుంటూ వుంది.

## ప్రాథమిక విద్య

విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది ప్రాథమిక విద్య. అయిదు నుండి పది సంవత్సరాల వయసులో ఉన్న పిల్లలు ఒక అద్భుతం. వాళ్ళు సంతోషానికి, తరగని చైతన్యానికి, కుతూహలానికి ప్రతిరూపాలు. తిరుగాడే ప్రశ్నార్థకాలు.

బడి, ఇల్లు... ఎక్కడైనా వాళ్ళు సంతోషంగా ఉండాలి. ఆట, పాట... ఏదైనా ఉల్లాసంగా సాగాలి. మట్టి, మొక్క... దేన్నైనా ప్రేమగా తడిమిచూడాలి, పరిశీలించాలి, ప్రశ్నించాలి. కొత్త విషయాలు తెలుసుకోవాలి. వాటిని అందరితో పంచుకోవాలి. పిల్లలకు సహజసిద్ధంగా చూసిన ప్రతి విషయం పట్ల కుతూహలం ఉంటుంది. వాళ్ళు చాలా నిశితమైన పరిశీలకులు. విషయాలను తెలుసుకునేందుకు, నేర్చుకునేందుకు ప్రతి ఒక్కరికి ఒక ప్రత్యేక పద్ధతి ఉంటుంది. నైపుణ్యాలను తెచ్చుకోవడంలో వారి బాణీ ఉంటుంది. అందుకే పిల్లలలో మనం నేర్పే విషయాలకంటే వాళ్ళు తమంతట తాము నేర్చుకునేవే ఎక్కువ ఉంటాయి. అందుచేత వారి సహజసిద్ధమైన ఈ అపురూప గుణాలను కాపాడుతూ బడి – పిల్లలకు నేర్పించాల్సినవి నేర్పించగలిగితే అది చాలా గొప్ప విజయమని అనుకోవచ్చు.

మొత్తంమీద పిల్లల బాల్యానందాలను కొల్లగొట్టకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను ఇవ్వడం, వారి పరిపూర్ణ వికాసానికి దోహదపడే పరిస్థితులను కల్పించడమే అభ్యాసవిద్యాలయంలో ప్రాథమిక స్థాయి విద్యయొక్క లక్ష్యం. ఈ

లక్ష్యానికి వీలైనంత దగ్గరలో ఉండటానికి నిత్యం మా ప్రయత్నం. ఒక్క వాక్యంలో చెప్పుకున్నంత సులువుకాదిది. పిల్లలను సంతోషంగా ఉంచుతూనే వారికి నేర్పించడమనేది టీచర్లకు కత్తి మీద సాములాంటిది.

ముందుగా మన ప్రధాన లక్ష్యం 'పిల్లలు సంతోషంగా ఎదగాలి' అనేది చూద్దాం. ఎందుకంటే ఈ దశలో వారిని సంతోషంగా ఉంచని ఎటువంటి పనైనా వారికి చేటుచేస్తుంది – మన దృష్టిలో అది ఎంత ముఖ్యమైన, గొప్ప లక్ష్యంతో కూడినదైనా కావచ్చుకాక. ఈ వయసు పిల్లలు ఏం చేసినా అది వారికి అవసరమని చేయరు. వారికి ఇష్టం కాబట్టి చేస్తారు. కాబట్టి వారికోసం నిర్మించే వాతావరణం, వేసుకునే ప్రణాళికలు అన్నీ వారికి సంతోషంగా, ఇష్టంగా ఉండాలన్న పునాదిపైనే ఉండాలి.

ప్రాథమిక స్థాయి వాతావరణంలో ప్రప్రథమంగా చెప్పుకోవలసింది టీచర్, పిల్లల మధ్య సంబంధం. ప్రేమ, వాత్సల్యం ఉన్న టీచర్ల వలన పిల్లలకు బడి ఇల్లులా అనిపిస్తుంది. ఇది లేకుండా మిగిలినవి ఏవి ఉన్నా వ్యర్థమే! అభ్యాస విద్యాలయం దీనికి పెద్ద పీట వేస్తుంది. టీచరు పిల్లలతో ఆడతారు, కలిసి భోజనం చేస్తారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటారు. పిల్లల ఇష్టాఇష్టాలు, ఇంట్లో విశేషాలు, బడిలో వాళ్ళ అల్లరి, వారిని నిరుత్సాహపరిచిన, బాధపెట్టిన విషయాలు... అన్నీ మాట్లాడుకుంటారు. టీచర్, పిల్లల మధ్య ఇది ఒక స్నేహాన్ని, దగ్గరతనాన్ని, భద్రతాభావాన్ని కలిగిస్తుంది. భయం పోగొట్టి, వాతావరణాన్ని సంతోషకరంగా ఉంచుతుంది. సంతోషకరమైన, భయంలేని వాతావరణంలోనే పిల్లలలోని బాల్యానందాలు సజీవంగా ఉంటాయి. టీచర్లు తమ పాఠ్యప్రణాళికను తయారు చేసుకోవడం, యాక్టివిటీలను రూపొందించుకోవడం, వాటిని అమలుచేసే విధానంలో కూడా ఈ సరదా, సంతోషం, స్నేహం అనే విషయాలు ముఖ్యంగా ఉండాలని ప్రయత్నిస్తారు.

పిల్లలను అవసరం వచ్చినప్పుడు తప్పక మందలించాల్సిందే! కాని అది ఖచ్చితంగా ఆ సందర్భంలో వారి ప్రవర్తన గురించి మాత్రమే అయి ఉండాలి. మందలించడం ఆ ప్రవర్తనను పిల్లవాడు గుర్తించి, సరిచేసుకోవడం గురించే తప్ప, టీచర్ తన

కోపం తీర్చుకోవడానికో, లేక పిల్లవాడిని అవమానించే విధంగా ఒక ముద్రవేయడానికో అయి ఉండకూడదు. ఈ స్పష్టత యొక్క అవసరాన్ని గురించి పలుమార్లు టీచర్లందరూ చర్చించుకుంటారు.

ప్రాథమిక స్థాయి వాతావరణంలో మరో ముఖ్యమైన అంశం భౌతికపరిస్థితులు. అభ్యాసవిద్యాలయం గుణదల కొండ మీద ఉంది కాబట్టి, నగరం నడిబొడ్డున ఉన్న కాలుష్యానికి దూరంగా ప్రశాంతమైన వాతావరణం వుంటుంది. కొండపై నుండి బడిలో నిలబడి ఎటువైపు చూసినా అందంగా ఉంటుంది. వర్షాకాలం, చలికాలం అయితే మరీనూ... బడిలో నాటిన మొక్కలు ఇప్పుడిప్పుడే వృక్షాలవుతున్నాయి. రెండు మూడు సంవత్సరాలలో మరింత పచ్చదనం, నీడ ఏర్పడతాయి.

**తరగతి గదులు**

మూడు నుండి పది సంవత్సరాల వయసు పిల్లలకు వాళ్ళు తిరుగాడే ప్రదేశాలన్నీ విశాలంగా, గాలీ, వెలుతురు ధారాళంగా వచ్చేవిగా ఉండటం చాలా అవసరం. అభ్యాస విద్యాలయంలో తరగతి గదులు పిల్లల సంఖ్యతో పోలిస్తే బాగా పెద్దవి. 25 మంది పిల్లలు కూర్చున్నా ఎంతో చోటు మిగిలి ఉండేంత విశాలమైన గదులు. బయటకు రాగానే తిరుగాడే కారిడార్.



ఈ వయసు పిల్లలు ఉదయం నుండి సాయంత్రం వరకు కదలకుండా కుర్చీలలో కూర్చోవడం వారి వెన్నెముకపై, పెరుగుదలపై చెడు ప్రభావం చూపుతుంది. ప్రాథమిక తరగతులలో పిల్లలకు కుర్చీలు ఉండవు. వర్క్‌టేబుల్స్ చుట్టూ ఇద్దరినుంచి నలుగురు పిల్లలు నేలమీద కూర్చుని యాక్టివిటీలను చేసుకుంటారు. అవసరం లేనప్పుడు బల్లలను ఒక ప్రక్కన పెట్టేసి గదినంతా ఉపయోగించుకుంటారు. ఉదాహరణకు అందరూ  గుండ్రంగా కూర్చోవాలంటే ఈ పద్ధతిలో చాలా హాయిగా వీలవుతుంది. గదిలోని స్థలాన్ని ఎలా కావాలంటే అలా వాడుకునే వీలు ఉంటుంది. వాళ్ళకు అవసరమైన లేదా ఇష్టమైన యాక్టివిటీలను తీసుకుని చేసుకోగలిగే వెసులుబాటు ఉంటుంది.

## నేర్చుకునే వాతావరణాలు / Subject Learning Environment

అభ్యాసవిద్యాలయంలో బోధనా కార్యక్రమం అంతా కృత్యాల ద్వారానే ఉండడం వల్ల ఏ సబ్జెక్టుకు సంబంధించినదైనా చాలా ఎక్కువ బోధనా సామగ్రి ఉంటుంది. అదంతా ఆ గదిలోనే ఉండడం చాలా అవసరం. టీచర్‌కు ఇది అనుకూలంగా



ఉంటుంది. పిల్లలకు కూడా తాము చేస్తున్న పని త్వరగా అయిపోతే వాళ్ళకు అవసరమైన లేదా ఇష్టమైన యాక్టివిటీని తీసుకొని చేసుకోగలిగే వెసులుబాటు ఉంటుంది.

గది గోడలకు ఉండే డిస్‌ప్లే బోర్డులలో అన్ని తరగతుల పిల్లలు, ఆ సబ్జక్టులలో చేసిన రకరకాల వర్క్‌లు ప్రదర్శించబడి ఉంటాయి. తమకంటే పెద్ద లేదా చిన్నవాళ్ళు చేసిన పనులను గమనించడం పిల్లలకు భిన్నమైన అవగాహనను, దృక్కోణాన్ని ఏర్పరచడంలో ఉపయోగిస్తుంది. అంతేకాక ఇలా ఆ సబ్జక్టుకు సంబంధించిన వాతావరణాన్ని ప్రతిఫలిస్తుండే ఆ గదులు నేర్చుకునే ప్రక్రియకు పిల్లలను మానసికంగా త్వరగా తయారుచేస్తాయి.



అభ్యసన ప్రణాళికలో పుస్తకాలు చదవడం అత్యంత ముఖ్యమైనది. సెంట్రల్ లైబ్రరీతో పాటుగా పుస్తకాలు చదవడం అలవాటుగా మారేందుకు దోహదపడే లైబ్రరీ ప్రతి వాతావరణానికి ఉంది. అందులో స్థాయిల వారీగా అన్ని తరగతులకు సరిపడా ఎన్నో రకాల ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన పుస్తకాలు ఉంటాయి. పిల్లలు తమకు ఖాళీ దొరికినప్పుడు ఇష్టమైన పుస్తకాన్ని తీసుకొని చదువుకోవచ్చు. ప్రతిరోజూ ఇంటికి ఒక పుస్తకం తీసుకెళతారు. అంతేకాక ప్రతి తరగతికి ఎంచబడిన నిర్దిష్టమైన పుస్తకాలు 25 నుండి 30 వరకు ఉంటాయి. అవి పిల్లలు ఆ సంవత్సర కాలంలో తప్పకుండా పూర్తిచేయాలి. ఈ పుస్తకాలన్నీ ఒక పద్ధతిలో పిల్లలకు అందుబాటులో అమర్చబడి ఉంటాయి.

**భాషా వాతావరణాలు (తెలుగు / ఇంగ్లీషు)**



జ్ఞాన సముపార్జనలో పిల్లలను స్వతంత్రులను చేసేది భాషానైపుణం. వినడం, చదవడం, మాట్లాడడం, వ్రాయడం అనే నైపుణ్యాలను పెంపొందించడం అన్ని అంశాలకంటే ముఖ్యమైనది. భాషానైపుణ్యాలు కేవలం టీచర్లు నేర్పడం వల్ల రావు. వాతావరణంలోంచి వాటిని అందిపుచ్చుకునే నైజం (Language Aquisation Skill) పిల్లలలో సహజసిద్ధంగా ఉంటుంది. కాకపోతే అది రకరకాల స్థాయిలలో



ఉంటుంది. కొంతమంది పిల్లలు భాషను అలవోకగా పట్టేస్తారు. కొంతమందికి ఇబ్బంది ఉంటుంది. సమయం పడుతుంది. కాబట్టి పిల్లలకు భాషను – అది

మాతృభాష కావచ్చు, ఇంగ్లీషు కావచ్చు – పట్టించాలంటే వాతావరణాన్ని కల్పించడం ముఖ్యం.

భాష అనేది భావ వ్యక్తీకరణ. మాట్లాడడం, అది మాట్లాడడం ద్వారా కావచ్చు. వ్రాయడం ద్వారా కావచ్చు. ఏదైనాకానీ ఒక స్పందననుండి రావాలి. అది సంతోషం, ఉద్వేగం, ఉత్సుకత, భయం, బాధ, కోపం, నిరుత్సాహం... ఏదైనా కావచ్చు. ఈ సప్పదనలకు సందర్భాలు కల్పించడం టీచర్ తన ప్రణాళికలో భాగంగా చేస్తారు. ఎందుకంటే ఏ కారణం, ఏ అవసరం, ఏ సందర్భం లేకుండా ఎవరూ మాట్లాడరు, వ్రాయరు. అటువంటి సందర్భాలను సృష్టించే యాక్టివిటీలు కొన్ని.

**అ. పండుగలు**



పిల్లలకు పండుగలంటే సరదా! అవి ఏ మతానికి సంబంధించినవైనా సరే. పండుగ వెనుక ఉన్న కథ ఒక విషయమైతే, అది జరుపుకోవడంలోని సంబరం పిల్లలకు ముఖ్యం. అభ్యాసవిద్యాలయంలో వీలైనన్ని పండుగలను జరుపుకుంటాం. ముందు టీచరు, పిల్లలు కలిసి ఆ పండుగ విశిష్ఠత, దాని వెనుక కథ, అది జరుపుకునే తీరు, ఆ సాంప్రదాయాల విలువల గురించి మాట్లాడుకుంటారు. పండుగ ఎలా జరుపుకుందాం అనే చర్చ తర్వాత పని విభజన చేసుకుంటారు. పండుగకు

సంబంధించిన పాటలు, నృత్యం, లేదా కథకు తగిన నాటికలు కూడా సాధన చేస్తారు. ఉదాహరణకు వినాయకచవితి జరుపుకుంటే ఆ రోజు సృజనోదయంలో (అసెంబ్లీ) నాటిక వేసి, తరువాత ఇతర తరగతి పిల్లలను కూడా పిలిచి, పాలవెల్లి కట్టడం దగ్గరనుంచి, ఉండ్రాళ్ళు చేయడం వరకు అన్నీ చేస్తారు. మట్టితో తాము చేసిన వినాయకుడికి పూజ చేసి, కథ చదువుకుని, ప్రసాదాలు పంచిపెడతారు. వినాయకుణ్ణి బడి అంతా ఊరేగిస్తారు. ఇక తరువాత కథ మామూలే. ఎవరి ఇష్టాన్నిబట్టి వారు వినాయకుడి కథనో, పాటనో, నాటికనో, వ్యాసాన్నో వ్రాస్తారు. ఆ పుస్తకాన్ని అపురూపంగా దాచుకుంటారు. క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి లాంటి పండుగలెన్నో బడిలో జరుపుకుంటాం! మతాల ప్రసక్తి లేకుండా పిల్లలందరూ అన్ని పండుగ సంబరాలలోనూ అంతే ఇష్టంతో పాల్గొనడం చూస్తే, భారతీయతలో ఉన్న స్ఫూర్తి ప్రతిఫలిస్తున్నట్లుంటుంది. భవిష్యత్తు ఆశాజనకంగా అనిపిస్తుంది.

**ఆ. వంటచేయడం**



వంటచేయడం అనేది రకరకాల అంశాలతో కూడిన ఒక సంపూర్ణమైన యాక్టివిటీ. పిల్లలకు వంట చేయడం అంటే చాలా సరదా, ఉత్సాహం. ఎందుకంటే చాలా ఇళ్ళల్లో వారికి ఆ అవకాశం ఉండదు. పెద్దలకు మాత్రమే పరిమితమైన ఆ పనిని

వారు బడిలో చేసినపుడు ఏదో గొప్ప విషయం సాధించిన సంతోషానికి లోనవుతారు. అంత ఇష్టం ఉన్న యాక్టివిటీ కాబట్టి తప్పకుండా ఉత్సాహంగా పాల్గొంటారు. పిల్లలను మాట్లాడించడానికి కావలసిన అంశాలు వంట చేయడంలో పుష్కలంగా ఉన్నాయి.

ఉదాహరణకు ఫ్రూట్‌సలాడ్ చేస్తున్నారనుకుందాం!

- ముందుగా ఇదివరకు ఎప్పుడైనా దానిని వారు తిన్నారా? లేదా?
- ఎటువంటి సందర్భాలలో తిన్నారు?
- అందులో ఏమేమి వాడతారు?



లాంటివి మాట్లాడుకున్నాక దానిని తయారుచేయడానికి ప్రణాళిక వేసుకుంటారు. ఏ ఏ పండ్లు వాడదాం? మొత్తం ఏ ఏ పండ్లు, ఎన్ని కావాలి? ఎవరు ఏమేమి తేవాలి? ఎంత ఖర్చవుతుంది? ఏ ఏ వస్తువులు అవసరమవుతాయి?... లాంటివి. అన్నీ ఫలానా రోజు తేవాలని డైరీలో వ్రాసుకుంటారు. ఆ రోజు అన్నీ తెచ్చుకున్నాక, టీచర్ పర్యవేక్షణలో వంతులవారీగా కడగడం, చెక్కుతీయడం, ముక్కలుకోయడం చేస్తారు. ఇంకా పంచదార, తేనెలాంటివి కలిపి అందరికీ పంచి, తామూ తింటారు. ఈ కార్యక్రమం మొత్తంలో చాలా చాలా మాటలు దొర్లుతాయి. పండ్ల ఖరీదులు, పండ్లను ముక్కలుగా కోశాక ఎందుకు తరగకూడదు? పచ్చిగా ఏవి తినాలి? పండుగా ఏవి తినాలి? వంటి విషయాలు ఎన్నో తెలుసుకుంటారు. పండ్ల పైన ఇష్టంలేని పిల్లలు దీని తర్వాత తినడం మొదలుపెట్టడం కూడా మాకు తెలుసు. టీచర్లందరకూ

పంచుతున్నప్పుడు వాళ్ళ ముఖాలలో వెలుగు. 'మేమే చేశాం టీచర్' అని ఎంత గొప్పగా చెబుతారో!

ఈ ఉత్సాహం, అనుభూతి అన్నీ సజీవంగా వారిలో ఉన్నప్పుడు ఇతరులతో పంచుకోవాలని ఉంటుంది. అది వాళ్ళ అనుభవాలను మాటల రూపంలో చెప్పడానికో, వ్రాయడానికో ప్రేరణనిస్తుంది. ఒక్క విషయం వదిలిపెట్టకుండా, గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తారు. లేదా ప్రత్యేకించి ఆ యాక్టివిటీ కోసమే తయారుచేసిన పుస్తకంలో పేజీలు, పేజీలు వ్రాసేస్తారు. ఎంతో పదజాలం, ఎన్నో రకాల వాక్యనిర్మాణాలు ప్రయోగించాల్సి వస్తుంది. ఎప్పుడో విన్నవీ, చదివినవీ, నేర్చుకున్నవీ అసంకల్పితంగా బయటకు వస్తాయి. తప్పులు చాలా దొర్లుతాయి. నేర్చుకోవడానికి తప్పులు చేయనిచ్చే అవకాశం చాలా అవసరం. తప్పులన్నీ టీచరు ఆ పుస్తకంలో దిద్దరు. ఎందుకంటే అది వారి ఉత్సాహం మీద నీళ్ళు జల్లినట్లు అవుతుంది. ఎంతో ఇష్టంగా వ్రాసుకున్న ఆ పుస్తకంలో ఎర్రటి మరకలు వారిని చిన్నబుచ్చుతాయి. టీచరు వారి అనుభూతిని పంచుకోలేదని అనుకుంటారు. తప్పులు వెదకడమే వారికి అర్థమవుతుంది. మరల వ్రాసినప్పుడు తప్పులు లేకుండా వ్రాయడంపైనే దృష్టిని పెట్టడం, దాని వల్ల ఆ సృజనలో జీవం లేకపోవడం జరుగవచ్చు. మరి తప్పులు సరిచేయకుండా వ్రాయడం ఎలా నేర్చుకుంటారు? దానికి వేరే సందర్భము, వేరే పద్ధతి ఉంటుంది. పిల్లలు తరచుగా చేస్తున్న తప్పులను గమనించి, దృష్టిలో పెట్టుకుని టీచరు విడిగా వాటిని పట్టించుకుంటారు. అంతేతప్ప పిల్లల సృజనాత్మక భావవ్యక్తీకరణలో తప్పులు పట్టరు. ఆ విధంగా అన్ని తరగతుల పిల్లలు ఎన్నో వంటలు చేశారు. కొందరు ఆ పద్ధతిని వివరిస్తూ వ్యాసాలు వ్రాస్తే, కొందరు పాటలు వ్రాసి బాణీలు కట్టి పాడారు.

### ఇ. సృజనాత్మక వ్యక్తీకరణ (Creative Expression)

పోటీ చదువులలో, మార్కుల వేటలో పిల్లలు తమ సొంతంగా ఆలోచించడం మానుకుంటున్నారు. చదువు అంటే మననం చేయడం, ఉన్నది ఉన్నట్లుగా రాయడం అనే పద్ధతికి అలవాటు పడిపోతున్నారు. సొంతంగా వ్రాయడం అన్న ఆలోచనే

రాదు. వచ్చినా చెయ్యరు. ఎందుకంటే సొంతంగా వ్రాస్తే తప్పులు వస్తాయి, మార్కులు తగ్గుతాయి. మార్కులు సాధించడమే ధ్యేయంగా చిన్నప్పటినుంచి పెరుగుతున్న



పిల్లలలో సృజనాత్మక ప్రతిభ మరుగునపడిపోవడం అటుంచి, తమకంటూ ఒక భిన్నమైన దృక్కోణం, శైలి ఉంటుందనే విషయాన్నే మరిచిపోతున్నారు. తప్పులు చేయకుండా నేర్చుకోవడం, లేదా తప్పులు దొర్లకుండా వ్రాయడం పిల్లలు చేయకూడదంటే – పసిపిల్లలు పడిపోకుండా నడక నేర్చుకోవాలని ఆశించడం లాంటిది. అది మన అత్యాశ, పిల్లలకు మానసిక ఒత్తిడి. ఏ పిల్లవాడికైనా తన మనసులోని భావాలను తన సొంతంగా వ్యక్తం చేయాలనే ఉంటుంది. సృజన అనేది వారికి సహజసిద్ధంగా ఉంటుంది. కొందరు పాటలు వ్రాయడం ద్వారా వ్యక్త పరిస్తే, కొందరు వర్ణిస్తారు, కొందరు సంభాషణలు వ్రాస్తారు, కొందరు బొమ్మ గీస్తారు, లేదా బొమ్మ చేస్తారు. రూపం ఏదైనా భావ వ్యక్తీకరణ వారి సొంతం.

పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరుచుకునే అవకాశం ఇవ్వడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా వారికది చాలా ఇష్టమైన పని. ఎంతో సంతోషాన్నిస్తుంది. పిల్లలలోకూడా మనకు తెలియని ఆందోళనలు, ఒత్తిడి ఉంటాయి. సృజనాత్మక వ్యక్తీకరణ ద్వారా పిల్లలు వాటిలోంచి బయటపడేందుకు చాలా అవకాశాలున్నాయి. తమపై తమకు ఇష్టం, విశ్వాసం పెరుగుతాయి. ఇక భాష లేదా ఇతర నైపుణ్యాలు ఎలానూ పెరుగుతాయి.

### ఈ. కథలు వ్రాయడం



కథలు వ్రాయడం పిల్లలకిష్టం. సొంతంగా కథలు కల్పించడం కూడా ఇష్టం. ఎందుకంటే ఊహలలోనే సాధ్యమయ్యే ఎన్నో కల్పితాలను కథలలో చూపించవచ్చు. పిల్లల సృజనాత్మక వ్యక్తీకరణకు పుష్కలంగా చోటున్న కృత్యం కథలు వ్రాయడం. వ్రాయడం రాకముందు పిల్లలను కథలు చెప్పడానికి ప్రోత్సహిస్తారు. వ్రాయడం వచ్చాకకూడా చెప్పడం ఉంటుంది కానీ, పిల్లలకు తాను వ్రాసిన కథ ఒక పుస్తక రూపం సంతరించుకోవడం, అందులో తామే వేసిన బొమ్మలుండడం ఇష్టంగా ఉంటుంది. కథలు రకరకాలుగా వ్రాస్తారు.

- ఒకసారి టీచర్ చెప్పిన కథని వారి భాషలో తిరిగి చిన్నగా వ్రాస్తారు.
- టీచర్ సగం చెప్పిన కథని పూర్తిచేస్తారు.
- టీచర్ ఇచ్చిన కథకు పేరుని పెట్టి, కథ అల్లుతారు.
- చూసిన డ్రామాను కథారూపంగా వ్రాస్తారు.
- పూర్తిగా తమ ఊహలనుంచి కథను గుర్తిస్తారు.
- బొమ్మ చూసి కథ వ్రాస్తారు.

ఇలా రకరకాల ప్రక్రియలలో కథ వ్రాయడం జరుగుతుంది.

### ఉ. నాటిక / సంభాషణలు వ్రాయడం

ఇది కథ వ్రాయడానికి భిన్నంగా ఉంటుంది. వర్ణన అవసరం పెద్దగా ఉండదు. కథ వ్రాయలేని పిల్లలు కూడా సంభాషణలు వ్రాయగలుగుతారు. టీచర్ చెప్పిన పాత్రలతో లేదా విన్న కథకు, చూసిన బొమ్మకు పూర్తిగా స్వంత ఆలోచనతో పిల్లలు సంభాషణలు, నాటికలు వ్రాస్తారు. వాటిని తాము పాత్రలుగా ప్రదర్శిస్తారు. లేదా పప్పెట్లు తయారుచేసుకుని ఆ నాటికను పప్పెట్రీ రూపంలో ప్రదర్శిస్తారు. దానికి తెరవెనుక సంభాషణలు చెప్పడం, పాట పాడడం, డప్పు కొట్టడం వంటివీ చేస్తారు.

### ఊ. పాటలువ్రాయడం

పాటలు సాధారణంగా ఎవరో వ్రాసినవి, టీచరు నేర్పినవి పాడుతుంటారు. ఇలా కాక తామే సొంతంగా పాటలు వ్రాసి, బాణీలు కట్టడం కొంతమంది పిల్లలు చాలా ఇష్టపడతారు. ఒక పండుగ జరుపుకున్నప్పుడో, ఒక వంట వండుకున్నప్పుడో, వాన పడినప్పుడో సందర్భాన్నిబట్టి వ్రాస్తారు. వారి నాటికలలో లేదా పప్పెట్రీలో అవసరమైతే వ్రాస్తారు. లేదా టీచరు చెప్పిన అంశంమీద వ్రాస్తారు. బృందాలలో చెట్ల క్రింద కూర్చుని బాణీలుకట్టి సృజనోదయంలో పాడతారు.

### ఎ. సీరియల్ కథ

ఏదైనా ఒక పిల్లల నవలను లేదా పెద్ద కథను టీచరు ప్రతిరోజూ పది నిమిషాలు చదువుతారు. ఇలా టీచరు చదివే సీరియల్ కథలంటే పిల్లలు చాలా ఇష్టపడతారు. ఉత్సుకతతో తరువాత భాగం కోసం ఎదురుచూస్తారు. ఆ కథ ముగిసాక, దానిమీద సమీక్ష వ్రాస్తారు. నొప్పిడాక్టరు, పారిపోయిన బఠాని, నల్లచేప పిల్ల కథ మొదలైనవి పిల్లలు బాగా మెచ్చిన నవలలు. పాఠ్య పుస్తకాలకు సంబంధించి కూడా టీచరు తమ పాత్రను వీలైనంతగా తగ్గించుకుంటారు.

## పరిసరాల విజ్ఞానం

ప్రాథమిక స్థాయిలో పరిసరాల విజ్ఞానం అంటే వారి పరిసరాలలోని మొక్కలు, జంతువులు, నదులు, సముద్రాలు, మనుషులు, వారి సమిష్టి జీవనానికి సహకరించే

వివిధ ప్రభుత్వ విభాగాలువంటి వాటిపై అవగాహన ఏర్పరుచుకోవడం. ఒకటినుండి ఐదు తరగతుల పిల్లల పాఠ్యపుస్తకాలలో ఉండేది ఎక్కువగా వారికి పరిశీలనలో ఉన్న విషయమే అయి ఉంటుంది. ఇందులోని సాంఘికపరమైన అంశాల (సోషల్



స్టడీస్) లక్ష్యం మనుషుల సంఘజీవనాన్ని సులభతరం చేసి, సజావుగా నడిపించే సంస్థలు అంటే పంచాయితీ, మునిసిపాలిటీ, పోస్టల్ అండ్ టెలికం సర్వీస్, బ్యాంకులు, ఆసుపత్రుల వంటి వాటి గురించి తెలుసుకోవడం, గ్రామజీవనం, నగర జీవనం, రాష్ట్రం, దేశంలాంటి వాటి అవగాహన కలిగించుకోవడం లాంటివి. తద్వారా పిల్లలు వాటన్నిటి యొక్క విశిష్ఠతను గుర్తించి అభినందించగలగాలి. ఇవి వివిధ వ్యక్తులను కలిసి మాట్లాడడం, క్షేత్రపర్యటనలు చేయడం ద్వారా జరుగుతాయి.

సైన్సుయొక్క లక్ష్యాలు పిల్లలలో నిశిత పరిశీలన, ప్రశ్నించడం, సమాచారాన్ని సేకరించడం, పరిశీలనలనుంచి క్రొత్త అవగాహన ఏర్పరచుకోవడం, తెలుసుకున్న విషయాన్ని నిత్యజీవితంలో చూడగలగడం, లేదా ఆచరణలో పెట్టగలగడం లాంటివి. సైన్సు పాఠాలలో చేసి చూడలేని, లేదా ప్రత్యక్షంగా చూసి తెలుసుకోలేని విషయాలు దరిదాపుగా ఉండవు. సైన్సు పాఠం ఒక పరిశోధనలా సాగుతుంది. క్రొత్త అంశాన్ని ప్రారంభించే ముందు సంబంధిత వ్యక్తులనుంచి గాని, పుస్తకాలనుంచి గాని ఆ

విషయానికి సంబంధించి పిల్లలకు తెలిసిన విషయాలను చర్చించడం, మరికొంత సమాచారాన్ని సేకరించడం ఆధారంగా పాఠ్యాంశం నడుస్తుంది.



- మొక్క గురించి తెలుసుకోవాలంటే మొక్కలలో తిరిగి, ప్రత్యక్షంగా పరిశీలించి తెలిసినవి మాట్లాడుకుని, కొత్త విషయాలు తెలుసుకున్నారు. స్వయంగా గింజలు నాటి, గింజ మొలకెత్తడం దగ్గర్నుంచి మొక్క అయ్యేవరకు దశలవారీగా ప్రతిరోజు గమనించి పుస్తకంలో బొమ్మలు గీసుకుని, రాసుకున్నారు. దాని పెరుగుదలను కొలిచి రికార్డు చేసుకున్నారు.
- పంటల గురించి తెలుసుకోవాలంటే పొలాలకెళ్ళారు. బడిలో చిన్న చిన్న ట్రేలు, లేదా పగిలిన కుండలలో వరి, గోధుమలాంటివి నాటి వారి బుల్లి పొలాలను సృష్టించుకున్నారు. అవి పంటనిచ్చేంత వరకు జాగ్రత్తగా పెంచారు. అన్ని దశలను ప్రతిరోజు గమనించారు. పంట... అంటే ఓ గుప్పెడు గింజలు... చేతికొచ్చాక మురిసిపోయారు.
- ఇళ్ళ నిర్మాణం గురించి నేర్చుకోవడంలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరిగి ఎన్నిరకాల ఇళ్ళున్నాయో బొమ్మలు గీసుకున్నారు. బంకమట్టితో ఇటుకలు చేసి, ఎండబెట్టి వాటితో గోడలు కట్టి బుల్లి బుల్లి ఇళ్ళు కట్టారు. వాటికి గడ్డి,తాటాకు, రేకు, డాబావంటి రకరకాల కప్పులు వేశారు. కరెంట్ కనెక్షన్

ఇచ్చి లైట్లు వెలిగించారు.

♦ పత్తికాయలను సేకరించి పత్తితో దారం చేశారు. ఆ దారంతో బట్టలు నేశారు.

♦ పురుగుల గురించి తెలుసుకునేందుకు బడి అంతా తిరిగి ఆవరణలో ఉన్న మొక్కలలో, రాళ్ళక్రింద, గోడమూలలలో, మట్టిలో ఉన్న రకరకాల పురుగులను గమనించారు.



♦ ఎముకలు పాఠం గురించి స్పష్టమైన అవగాహనకోసం టీచరు ఇచ్చిన రకరకాల కార్డ్‌బోర్డ్ ఎముకలను అస్థిపంజరంలా దారాలతో కుట్టారు. సెన్స్ ఆర్గాన్స్ గురించి రకరకాల వస్తువులు సేకరించి వాటితో సెన్సోరియల్‌గేమ్స్ ఆడుకున్నారు.

తెలుసుకున్న విషయాన్ని వివరించడం కూడా ముఖ్యమే. తాము చేసిన ప్రయోగాలను, ప్రాజెక్టులను గురించి సృజనోదయంలోను, తమ తరగతిలోను వివరిస్తారు. ప్రతి పాఠ్యాంశాన్ని కలిసి చదువుకొని టీచరు సహాయంతో ప్రశ్నలకు వారే సమాధానాలు వ్రాస్తారు. ఆ పాఠ్యాంశానికి సంబంధించిన పుస్తకాలను టీచరు సహాయంతో లైబ్రరీలో వెతికి చదువుకుంటారు. వాటిద్వారా సేకరించిన క్రొత్త విషయాలలో వారికి వారే ప్రశ్నలు తయారుచేసి క్విజ్ పెట్టుకున్నారు. సైన్సులో కొత్త పదజాలం నేర్చుకోవడం ముఖ్యమైనది. పాఠ్యపుస్తకాలలోని క్రొత్త పదాలను

ఫ్లాష్‌కార్డులనుపయోగించి రకరకాల ఆటలు ఆడడం ద్వారా నేర్చుకుంటారు.

వాళ్ళు చేసిన ప్రాజెక్టులు, గీసిన బొమ్మలు, వ్రాసిన షీట్లు అన్నీ డిస్‌ప్లే బోర్డుపైన బల్లలపైన, సైన్సుగదిలో ప్రదర్శించబడి ఉంటాయి.

'చేసిచూడడం' ద్వారా, ఒక ఆటలా, సరదాగా సైన్సు, సోషల్‌స్టడీస్ అంశాలను నేర్చుకుంటారు.

## లెక్కలు నేర్చుకునే వాతావరణం



ప్రాథమిక దశలో గణితంలోని ప్రతి ఒక్క భావనను ఖచ్చితంగా కృత్యాల ద్వారా మాత్రమే నేర్పడం జరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు రోజువారీ ఎదుర్కొనే సమస్యలు, వాటికి పనికివచ్చే అంశాలలోనే వారి లెక్కలన్నీ ఉంటాయి. గణితంలో ప్రధానంగా రెండు అంశాలున్నాయి. ఒకటి, ఒక సమస్యను సాధించడానికి ఏ భావనలను ఉపయోగించాలో తెలియడం. అంటే కూడిక, తీసివేత, గుణింతము, భాగహారము లాంటివి. రెండవది ఆ భావనలను ఉపయోగించి లెక్కను త్వరగా తప్పులు లేకుండా చేయగలగడం. ఈ రెండూ గణితంలో ముఖ్యమైనవయినప్పటికీ, మొదటి అంశం అంటే సమస్యను అర్థం చేసుకొని, దాన్ని ఎలా సాధించాలన్నది తెలియడం ఎక్కువ అవసరం. కానీ దురదృష్టవశాత్తు స్పీడ్ అండ్ ఆక్యురసీనే గణితం బాగా రావడంలాగా ప్రస్తుతం చలామణీ అవుతుంది.

గణితంలో అత్యంత ముఖ్యమైనదీ, సాధారణంగా అంతగా పట్టించుకోనిదీ అంచనా వేయడం. సమస్యను అర్థం చేసుకొని గణాంకాలనుబట్టి సమాధానం ఫలానా దానికి దగ్గరగా ఉంటుందని ఇంచుమించుగా అనుకోవడం (ఎస్టిమేషన్ అండ్ అప్రాక్షిమేషన్). ఉదాహరణకు చేతిలో ఉన్న ఏదైనా వస్తువు ఇంచుమించుగా ఎంత బరువు ఉంటుందో అంచనా వేయగలగాలి. 290ని 3 తో భాగిస్తే సమాధానం వందకంటే తక్కువ అని అనుకోగలగాలి. వందకంటే ఎక్కువ సమాధానం వస్తే అది ఖచ్చితంగా తప్పు అని తెలియాలి. ఇంకా ఏదైనా లెక్కలో ఒక భావనను ఉపయోగించినా, ఏదైనా గుర్తును ఉపయోగించినా ఎందుకు అలా చేస్తున్నారో తెలిసి చేయడం ముఖ్యం. మైనస్ × మైనస్ = ప్లస్ అనేది ఎందుకో తెలియాలి. $3/_4 \,/\, 5/_2 = 3/_4 \times 2/_5$. భిన్నాన్ని భిన్నంతో భాగించినప్పుడు తిరగవేసి హెచ్చించాలి అని తెలిస్తే చాలదు. అలా ఎందుకు చేయాలో తెలియాలి.

అభ్యాస విద్యాలయంలో లెక్కల గదిలోకి (మాథ్ ఎన్విరాన్‌మెంట్) వెళ్ళగానే ఒక భిన్నమైన వాతావరణంలోకి అడుగుపెట్టినట్లు ఉంటుంది. గదిచుట్టూ ఉన్న అలమారాలలో అమర్చబడి ఉన్న యాక్టివిటీ మెటీరియల్స్‌ని నిశితంగా పరిశీలిస్తే అవన్నీ అక్కడ ఎందుకు ఉన్నాయో అర్థం అవుతుంది. ఆ గదిలో పిల్లలకు ఇంటిలోనూ, ఇంటిబయటా, బడిలోను ప్రతి నిత్యం ఎదురయ్యే సమస్యలన్నీ ఉండాలి. ఇంట్లో పిల్లలకు లెక్కలు ఎక్కడెక్కడ ఉపయోగపడతాయి? లేదా అవసరమవుతాయి? విద్యుత్ బిల్లు ఎంత వచ్చింది? రోజూ పాలు ఎన్ని పోయించుకుంటారు? పాలకి నెలకి ఎంత అవసరమవుతుంది? ఇస్త్రీబట్టల లెక్కలు, అమ్మ రోజు కొనే కూరగాయలు, నెల సరుకులు... ఇటువంటివి. ఇంటిబయట ఎటువంటి సమస్యలు ఉంటాయి? కొట్టుకు వెళ్ళి సరుకులు తెమ్మని అమ్మ ఇచ్చిన డబ్బులకు లెక్క చెప్పగలగడం; ఆర్టీసీ, రైల్వే టికెట్ల ఛార్జీలు; హోటల్‌కి వెళ్ళి ఎంతమంది ఏం తింటే ఎంత బిల్లు అవుతుంది?; బట్టల కొట్టులో బట్టలు కొనేటప్పుడు ఎంత శాతం రిబేటు ఉంటే ఎంత తగ్గుతుంది?... లాంటివి. ఇక బడిలో కొత్త యూనిఫామ్ ఎన్ని మీటర్ల గుడ్డ ఎంతయింది? పాఠ్య పుస్తకాల సెట్టు ఎంత ఖరీదు?

తరగతి గదిలో పిల్లల పొడవు, బరువు, తరగతి గది, గ్రౌండుల వైశాల్యాలు, స్కూల్లో త్రాగునీరు రోజుకు ఎన్ని లీటర్లు, ఎంత ఖర్చవుతుంది?... లాంటివి. అభ్యాస విద్యాలయం లెక్కల గదిలో ఈ సమస్యలన్నీ పిల్లలకు ఎదురవుతాయి. అంటే నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలను, గది వాతావరణంలో సృష్టించడం.

ఏ రకమైన భావనలనైనా నేర్పించడానికి అవసరమయ్యే వస్తువులు లెక్కలగదిలో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. కొన్ని నిర్ధిష్టమైన వస్తువులైతే, కొన్ని వాటికి ప్రత్యామ్నాయాలు. ఉదాహరణకు... బరువు గురించి లెక్కలు నేర్చుకోవడానికి తూనికలు, తూనికరాళ్ళు ఉంటాయి. సాధారణ తూనికతో పాటు డిజిటల్ వెయింగ్ మిషన్ కూడా ఉంటుంది. రకరకాల తూనికరాళ్ళకు బదులుగా వాడుకోవడానికి అంతే బరువుగల ఇసుక పాకెట్లు ఉంటాయి.

- కొలజాడీలు, వాటికి బదులుగా గుర్తులుపెట్టిన కూల్‌డ్రింక్ బాటిల్సు.
- టైలర్‌టేప్, స్కేళ్ళు వాటికి బదులుగా పిల్లలు తయారుచేసుకున్న రకరకాల పొడవులు గల తాళ్ళు.
- వైశాల్యం లెక్కల కోసం రంగు పేపర్లు, కత్తెర్లు.
- ఒకట్లు, పదులు, వందలు, వేలు, దశాంశాలు, భాగహారం, కూడికలలాంటి భావనల కోసం పుల్లల కట్టలు, పూసలు, పూసల దండలు లాంటివి ఎన్నెన్నో రకాల మెటీరియల్స్ ఉంటాయి.

సాధనకోసం మళ్ళీ మళ్ళీ అదే పద్ధతిలో లెక్కలు చేయిస్తే పిల్లలకు సరదా ఉండదు. సరదా లేని చోట ఆ వయసు పిల్లలకు ఏకాగ్రత నిలవడం కష్టం. కాబట్టి అన్నిరకాల భావనలకు సాధన అయ్యేలా, పిల్లలకిష్టమయ్యే రకరకాల మాథ్ గేమ్స్ ఉంటాయి.

హొటల్ గేమ్ కోసం మెనూ కార్డ్స్, కొట్టు ఆట కోసం కొట్టులో సాధారణంగా కొనే నూనెలు, పౌడర్, సబ్బులు లాంటివి ఖాళీ పెట్టెలు ఉంటాయి. బిల్లు బుక్స్, నకిలీ డబ్బులు కూడా ఉంటాయి. బడిలోనే తయారుచేసుకున్న రకరకాల బోర్డు

గేమ్స్ ఉంటాయి. పావులు, డైస్‌తో ఆడే ఈ ఆటలు ప్రత్యేకించి కొన్ని భావనలను సాధన చేసేవిగా ఉంటాయి. ఆట నియమాలు బట్టి ఆడేస్తూనే పిల్లలు తమకు తెలియకుండా కూడిక, గుణింతం వంటి భావనలను సాధన చేస్తూ ఉంటారు. ఆటలన్నీ సరదా కోసం, గణితం కోసం మాత్రమే కాక కొన్ని ప్రవర్తనా లక్ష్యాలు కూడా సాధిస్తాయి. అంటే కొన్ని టీచర్ సహాయంతో, కొన్ని బృందాలుగా, కొన్ని ఒక్కళ్ళే ఆడుకునేవి ఉంటాయి. వారికి వారు ఆడుకునేవి స్పష్టతకు, ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, బృందాలలో ఆడేవి ఎదుటివారి ఎత్తులను బట్టి అప్పటికప్పుడు మార్పులు చేసుకోవడం, కలిసిసాధించడం వంటి వాటిని ప్రోత్సహిస్తాయి.

సమస్యను సాధించడమే కాక, సమస్యలను తయారుచేయడం చేస్తే భావనల మీద మరింత స్పష్టత, పట్టు సాధిస్తారు. అందుకే పిల్లలు క్లాస్ వర్క్, హోంవర్క్‌లలో భాగంగా సంబంధిత అంశాలలో తామే లెక్కలు తయారుచేస్తారు. వాటిని వేరే పిల్లలు సాధిస్తారు. పెద్దలు తయారుచేసే లెక్కలకు భిన్నంగా, పిల్లలకే సాధ్యమయ్యే తమాషా, సరదా, ఆలోచనలతో ఉంటాయి ఆ లెక్కలు. హెచ్చవేతకు ఒక మూడో తరగతి పాప తయారుచేసిన లెక్క : 'ఒక చెట్టు కింద నేను ఒక రూపాయి పెట్టాను. అది ఒక మంత్రం చెట్టు. దాని కింద పెట్టినవి ప్రతిరోజూ నాలుగు రెట్లు అవుతాయి. వారం రోజుల తర్వాత నేను త్రవ్వితే నాకు ఎన్ని డబ్బులు దొరికాయి?' ఇందులో ఎంత సరదా ఉంది, ఎంత స్పష్టత ఉంది?

పిల్లలకు తరగతి బయట ఆటస్థలంలో ఆడుతూ నేర్చుకోవడం చాలా ఇష్టం. అందుకే వీలైనప్పుడల్లా టీచర్ తన ప్రణాళికలో అవుట్‌డోర్ యాక్టివిటీస్‌ను రూపొందించుకుంటారు. ఉదాహరణకు రెండో ఎక్కం నేర్చుకుంటుంటే గ్రౌండ్‌లో ఒకటి నుండి ఇరవై నెంబర్ల నిచ్చెన గీసి, పిల్లలకు త్రీ టైమ్స్ టు అంటే సున్నాలో ఉన్న పిల్లవాడు రెండు గీతల కొకసారి చొప్పున దూకుతూ వెళ్ళి ఆరు మీద ఆగాలి. మెటీరియల్స్‌తో చేసి ఆటలాడుకుంటూ నేర్చుకోవడం పిల్లలలో స్పష్టమైన అవగాహన, తర్కాన్ని పెంచుతుంది. 223ను 2 వందలుగా, 2 పదులుగా, 3 ఒకట్లుగా స్పష్టంగా చూడగలుగుతాడు. గణితం ఈ విధంగా నేర్చుకున్న పిల్లలు దానిని తరువాత

ఫిజిక్స్, కెమిస్ట్రీలాంటి సబ్జెక్టులలో తేలికగా అప్లై చేయగలుగుతారు. గణితం ద్వారా ఏర్పడిన తర్కం ఇతర ఏ విషయాన్నైనా తార్కికంగా ఆలోచించి తెలుసుకోవడానికి ఉపయోగిస్తుంది.

ఈ విధంగా ప్రాథమిక స్థాయి పిల్లలలో నేర్చుకునే కుతూహలం కొనసాగే పద్ధతులలోనే గణిత, సామాన్యశాస్త్రాలలో నైపుణ్యాలను ఇవ్వడం, తద్వారా పై తరగతులకు సన్నద్ధం చేయడం జరుగుతుంది.

## అభ్యాస విద్యాలయం - ఒక అవగాహన

**సృజనోదయం :**



ప్రతి ఉదయం బడి ప్రారంభంలో ఒకటినుండి పదవ తరగతి వరకు పిల్లలు కలిసి గడిపే ఇరవై నిముషాల సమయమే సృజనోదయం. పిల్లలు తమ సృజనాత్మక ఆలోచనలను, నైపుణ్యాలను అందరితో పంచుకోవడమే దీని ఉద్దేశ్యం. విషయం ఎంత చిన్నదైనా కావచ్చు. ఓపాట, ఓ కవిత, ఓ చిన్ననాటిక, ఓ డాన్సు, ఇష్టంగా ఇంట్లో చేసుకొచ్చిన ఓ క్రాఫ్ట్‌వర్క్, గీసిన ఓ బొమ్మ, ఓ చిలిపి ప్రశ్న, కొత్తగా చదివిన ఓ కథ, తను చూసి వచ్చిన ఓ ప్రదేశం... ఇలా ఏదైనా కావచ్చు అందరితో సంతోషంగా పంచుకోవాలనుకునే ఏ విషయానికైనా సృజనోదయంలో చోటు

ఉంటుంది. సాధారణంగా రోజుకొక తరగతి నిర్వహించాలనే అంగీకారం ఉన్నా అది నిబంధన కాదు. సృజనాత్మకత పిల్లల సహజ లక్షణం. నిత్యం వారిలో కొత్త ఆలోచనలు పుడుతూనే ఉంటాయి. ఎప్పుడో జరిగే సంబరాలకో, వార్షికోత్సవానికో పరిమితం కాకుండా ప్రతినిత్యం వాటిని పంచుకునే, ప్రదర్శించే అవకాశం ఉండాలనేది ఒక ముఖ్య ఉద్దేశ్యం. రెండవది బడి ప్రారంభంలో వారు గడిపే ఆ ఇరవై నిముషాలు యాంత్రికంగా కాకుండా, సరికొత్తగా, సంతోషంగా ఉంటే దాని ప్రభావం వారిపై రోజంతా ఉంటుందనేది.

ఈ కార్యక్రమంలో పిల్లలు ఒక్కరుగానో, లేదా జతలుగానో, బృందాలుగానో, వేరువేరు తరగతుల పిల్లలతోనో కలిసి పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ అందరు పిల్లలు, టీచర్ల ముందు జరిగే కార్యక్రమం కనుక ఇందులో పాల్గొనడం వల్ల పదిమంది ముందు మాట్లాడటం, పాడటం వంటివి చేయడానికి బెరుకుపోయే అవకాశం ఎక్కువ. వారు ప్రదర్శించే అంశాలను కొన్నింటిని టీచర్ల సహాయంతో చేస్తే, మరికొన్ని పూర్తిగా టీచర్ల ప్రమేయం లేకుండా చేస్తారు. అది ఒక డాన్సో, డ్రామానో... ఏదైనా కానీ దానికి కావలసిన సామగ్రినికూడా వాళ్ళే తయారుచేసుకుంటారు. ఈ ప్రక్రియలో ఒకరితో ఒకరు చర్చించుకోవడం, అభిప్రాయ భేదాలనుండి బయటపడడం, అంగీకారానికి రావడంలాంటి అవసరమైన లక్షణాలన్నీ అలవరచుకోవలసి వస్తుంది. ఇది చాలా విలువైన విషయంగా గుర్తిస్తాం. పిల్లలేకాక టీచర్లు కూడా సరదాగా చిన్న నాటికలు వేయడం, పాటలు పాడటం, మంచి కథలు, విశేషాలు చదివి వినిపించడం, అనుభవాలను పంచుకోవడం లాంటివి చేస్తారు.

**ఆటలు**

'No child ever has enough play' అంటారు A.S.Neil.

ఆటలు, పిల్లలు ఇవి విడదీయలేని పదాలు. ఆటలాడని పిల్లలు పిల్లలే కాదు, ఆటస్థలం, పిల్లలకు ఆడుకోవడానికి అవకాశం లేని బడి బడే కాదు. ఆడుకోవడం వారి హక్కు. ఆడుకోవలసిన వయసులో ఆ హక్కుని కొల్లగొట్టడం శిక్ష వేయదగ్గ

నేరం. ఆటలాడకుండా పెరిగే పిల్లలు రకరకాల రుగ్మతలకు, బలహీనతలకు లోనవుతారన్నది సత్యం. మా బడిలో ఒకేసారి రెండు తరగతుల పిల్లలు



ఆడుకోగలిగినంత ఆటస్థలం ఉంది. ఏడవ తరగతి వరకు రోజుకు కనీసం ఒక పీరియడ్, ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు వారానికి ఐదు, లేక ఆరు పీరియడ్లు తప్పనిసరిగా ఆటలకు కేటాయించబడ్డాయి. మరి ఏ ఇతర కార్యక్రమాలలాగే ఆటలు కూడా పిల్లల వికాసానికి దోహదపడాలి. ఆటల లక్ష్యం గెలుపు మాత్రమే కారాదు. పోటీలలో నెగ్గగలిగే బృందాలను తయారుచేయడం ప్రాధాన్యం కాదు.

అందరికీ అన్ని ఆటలలో సమానంగా పాల్గొనే అవకాశం ఉండాలి. ఆరుబయట ఒళ్ళు అలసిపోయేలా ఆటలు ఆడాలి. ఎముకల దృఢత్వానికి, కండరాల పటుత్వానికి ఇవి ఎంతో అవసరం. ఆటలలో ఉత్సాహం, సంతోషం ఉండాలి... గెలిచినా, ఓడినా కూడా. అందర్నీ కలుపుకునిపోతూ ఏ బృందంలోనైనా అదే స్ఫూర్తితో ఆడటం అలవాటు కావాలి. నెగ్గడానికి ఆడాలికానీ, నెగ్గడానికి మాత్రమే ఆడకూడదు. ఆటలద్వారా కూడా నిజాయితీ అలవడాలి. ఆటలు వారిని చదువులో మరింత ఏకాగ్రత నిలిపేలా చేస్తాయి. ఏ ఆటలు ఆడాలి, ఎప్పుడు ఆడాలి లాంటివి హైస్కూలు

పిల్లలు రెండు వారాల ప్రణాళికలో వారే నిర్ణయించుకుంటారు. సాధారణంగా వారు దానికి కట్టుబడే ఆడతారు. కొన్ని అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఆడే ఆటలు, విడివిడిగా ఆడేవి కొన్ని. ఒకే తరగతి పిల్లలు ఆడేవి కొన్ని. వేరువేరు తరగతుల పిల్లలు ఆడేవి ఇంకొన్ని. అవకాశం బట్టి టీచర్లు పిల్లలతో కలిసి ఆడటం బాగుంటుందని అనుకుంటాం. తమతో కలిసి ఆడే టీచర్లకు పిల్లలు మరింత దగ్గరవుతారు.

**<u>లైబ్రరీ</u>**



పుస్తకాలతో స్నేహం పిల్లలను ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుతుంది. నేర్చుకోవడంలో శాశ్వతమైన స్వేచ్ఛనిస్తుంది. చదివేకొద్దీ పిల్లలు చదవడంలోని ఆనందాన్ని మరింత ఆస్వాదిస్తారు. కొత్త విషయాలు తెలుసుకున్న కొద్దీ కుతూహలం పెరుగుతూ ఉంటుంది.

పుస్తకాలు పిల్లల్ని నిత్యం పలకరిస్తూ ఉండాలి. నేస్తాలను పిలిచినట్లు రా... రమ్మనాలి. మెల్లగా ఆ స్నేహం బలపడి జీవితాంతం నిలిచిపోవాలి. పుస్తకాల ప్రపంచంలో విహరించే పిల్లలకు నేర్చుకోవడానికి ఓ నియమం, హద్దు ఉంటాయా? తీరని దాహం తప్ప. పాఠ్యపుస్తకాలతో కుస్తీపట్టే పిల్లలకు ఈ సంతోషం దక్కుతుందా? అందుకే అభ్యాస విద్యాలయం పిల్లలలో పుస్తకాల పట్ల ప్రేమను పెంచడానికి

నిరంతరం ప్రయత్నిస్తుంటుంది, ప్రోత్సహిస్తుంటుంది. వేలపుస్తకాలతో కూడిన మా లైబ్రరీలో అక్షరాలు ఇంకా రాని పిల్లలు చదువుకునే 'కాప్షన్‌లెస్ పుస్తకాల'నుండి విజ్ఞాన భాండాగారాలైన 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, చైల్డ్ క్రాఫ్ట్ సిరీస్' లాంటి వాటి వరకు అన్నిరకాల, అన్ని స్థాయిల పుస్తకాలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో కథల పుస్తకాలు, నవలలు, పత్రికలు, వ్యాకరణం, డిక్షనరీలు, టీచర్ల - తల్లితండ్రుల అవగాహనకోసం పుస్తకాలు, హిస్టరీ, జాగ్రఫీ పుస్తకాలు, బయోగ్రఫీలు... ఇలా ఎన్నో రకాల పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉంటాయి.

ఒకటవ తరగతి మొదలుకొని పిల్లలందరికీ లైబ్రరీ పీరియడ్లు తప్పకుండా ఉంటాయి. చిన్న తరగతులలో ప్రతిరోజూ, పై తరగతులలో వారానికి కనీసం మూడు లైబ్రరీ పీరియడ్లు ఉంటాయి. ఆ సమయంలో వారికి ఏ పుస్తకాన్నైనా ఎంపిక చేసుకొని, చదువుకునే స్వేచ్ఛ ఉంటుంది. లైబ్రరీ ప్రవర్తనా నియమావళి ఏ వయసు పిల్లలైనా అలవరచుకోవలసిందే. నిశబ్దం పాటించడం, ఎవరూ ఎవరి ఏకాగ్రతనీ భంగపరచకపోవడం వల్ల పుస్తకాలలో లీనమైపోయి చదువుకునే అవకాశం ఉంటుంది. పుస్తకాలను భద్రంగా జాగ్రత్తగా ఉంచడం, విలువగా చూడడం అలవడుతుంది. పాఠ్యపుస్తకాలలోని విషయాలకు అనుసంధానంగా, కొనసాగింపుగా తగిన ప్రాజెక్టులు రూపొందించి ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల పిల్లలకు రకరకాల పుస్తకాలలోంచి, పత్రికలలోంచి సమాచారం సేకరించి, సమగ్రంగా నేర్చుకొనేందుకు అవకాశం కలుగుతుంది. నేర్చుకోవడం ఎక్కువ అర్థవంతంగా ఉంటుంది. చదివిన పుస్తకాలపై సమీక్షలు వ్రాయడాన్ని ప్రాథమిక దశనుంచే ప్రోత్సహిస్తాం.

## సైన్స్ లాబ్ - సైన్స్ మ్యూజియం

ప్రయోగాల ద్వారా సైన్స్ పాఠాలు బోధించడానికి అవసరమైన సదుపాయాలు అభ్యాస విద్యాలయంలో ఎప్పుడూ ఉన్నాయి. ఈ సంవత్సరం సైన్స్ లాబ్‌ను పరిపూర్ణం చేసుకోగలిగాము. పాఠ్యాంశాలకు సంబంధించిన ఏ ప్రయోగమైనా చేయగలిగే అన్ని వసతులు, పరికరాలు, రసాయనాలు సమకూర్చుకోగలిగాము.

భౌతికశాస్త్రంలోని కొన్ని అంశాలను బోధించడానికి నిర్దిష్టమైన కొన్ని పరికరాలు

తప్పక వాడవలసి వస్తుంది. ఉదాహరణకి రిసోనెన్స్ అనే అంశాన్ని ట్యూనింగ్ ఫోర్క్‌ల ద్వారా చూపించడానికి ఆ పరికరాలు వాడవలసిందే! కాని నిర్దిష్టమైన పరికరాలకు పరిమితమైపోయి, అవి లేవు కాబట్టి ప్రయోగాలు చేయలేమనుకునే నిస్సహాయత టీచర్లు కనబరిచినపుడు పిల్లలు సైన్సును లాబ్ నాలుగు గోడల మధ్యే చూడగలుగుతారు. కానీ సైన్స్ మన నిత్యజీవితంలో, మనచుట్టూ ఉండే ప్రతి వస్తువులోనూ, మనచుట్టూ జరిగే ప్రతి ప్రక్రియలోనూ పిల్లలు చూడగలగాలి. అందుబాటులో ఉండే అతి సాధారణమైన వస్తువులతో ప్రయోగాలు చేయగలగాలి.



ఉదాహరణకి స్ప్రింగ్‌బాలెన్స్ లాబ్‌లో లేకపోతే రబ్బరుబ్యాండ్‌తో దాన్ని ఎలా చేయవచ్చో చూపించాలి. అభ్యాస విద్యాలయంలో అటువంటి స్ఫూర్తిని పిల్లలలో కలిగించడానికి ప్రయత్నం జరుగుతోంది. అప్పుడు పిల్లలు ప్రతి వస్తువునీ నిశితంగా గమనించడం, దాని తీరు, నిర్మాణంలోని సైన్స్ అంశాలను చూడగలగడం అనే అద్భుతమైన ప్రక్రియ మొదలవుతుంది. తమకు కుతూహలం కలిగించిన ప్రతి వస్తువునీ సేకరించడం మొదలుపెడతారు. గుండుసూది, స్పూను, నాలుకబద్ద మొదలుకొని పాతవైర్లు, బొమ్మకార్లచక్రాలు, పాడైపోయిన స్పీకర్లలోని అయస్కాంతాలు,

వాడేసిన పెన్నులు ఇలా ఇదీ అదీ అని లేకుండా వారు సేకరించిన రకరకాల పనికొచ్చే 'పనికిరాని' వస్తువులన్నీ లాబ్‌లో ఉండాలి. వాటితో సైంటిస్టుల్లా పనిచేసి పరిశోధించే అవకాశం పిల్లలకు ఉండాలి. అదే అసలైన ప్రయోగశాల. ఇదే విధంగా రసాయనశాస్త్రం, జీవశాస్త్రాలకు సంబంధించి వంట ఇంటిలోని పదార్థాలు, కూరగాయలు, పండ్లు మొదలుకొని ఎన్నోవాటితో బోల్డన్ని ప్రయోగాలు పిల్లలు చేస్తారు. ఇక సైన్స్‌లాబ్ కేవలం ప్రయోగాలకే కాక, ఒక మ్యూజియంలా కూడా ఉంటుంది. మనం చాలా మామూలుగా, అనాసక్తతతో పట్టించుకోని ఎన్నో వస్తువులు పిల్లలకు అద్భుతంగా, ఆశ్చర్యకరంగా అనిపిస్తాయి. వాటిని పదిలంగా దాచుకుంటారు. రకరకాల గులకరాళ్ళు, గవ్వలు, చెట్టుబెరడులు మొదలుకొని, స్టార్‌ఫిష్, పాముకుబుసం, జంతువుల ఎముకలు, ఈకలు, తుమ్మజిగురు, పైన్‌కోన్, పట్టుపురుగు గూళ్ళు ఇలా లెక్కలేనన్ని తెస్తారు. వాటిని మ్యూజియంలో భద్రపరచవచ్చు. వాటి గురించి మాట్లాడాలన్న, తెలుసుకోవాలన్న కుతూహలం వారికుంటుంది. ఆ సందర్భంగా దాన్ని గురించి చర్చల ద్వారా, పుస్తకాల ద్వారా తెలుసుకుంటే అదొక అద్భుతమైన అనుభవం.

## డిస్‌ప్లే బోర్డులు

తరగతి వాతావరణంలో డిస్‌ప్లేబోర్డుల పాత్ర చాలా ముఖ్యమైనది. పాఠాలకు సంబంధించి ఆ తరగతిలో జరిగిన, జరుగుతున్న, జరగబోవు ఆక్టివిటీలను అవి ప్రతిఫలిస్తుంటాయి. అంతేకాక పిల్లలు గీసిన బొమ్మలు, చేసిన క్రాఫ్టులు, న్యూస్‌పేపర్లు, పత్రికల నుంచి సేకరించిన ఆసక్తికరమైన సమాచారం, వార్తలలోని విశేషాలు, సూక్తులు, జోకులు, ఏమన్నా డిస్‌ప్లే బోర్డుల మీద ప్రదర్శించవచ్చు.

బెరుకులేని పిల్లలకు గుర్తింపు తేలికగా వస్తుంది. కానీ అందరిలో తమ నైపుణ్యాలు ప్రదర్శించడానికి బిడియపడే లేదా భయపడే పిల్లలకు వీటి ద్వారా గుర్తింపు, ప్రోత్సాహం లభించి బెరుకునుండి బయటపడే అవకాశం ఉంది. ఈ బోర్డులలో విషయాలు కానీ, బొమ్మలు కానీ కొద్దిరోజుల పాటు ఉంచడం వల్ల పిల్లలకు వాటిని వీలున్నప్పుడు చదువుకునే వెసులుబాటు, పదే పదే వాటిని అప్రయత్నంగా చూడడం

వల్ల మనసులో నాటుకుపోయే అవకాశం ఉంటాయి. బృందాలలో, వంతులువారీగా వాటి నిర్వహణ పిల్లలే చేస్తారు. నెలాంతరంలో వాటిలో ప్రదర్శించిన విజ్ఞాన విషయాలు, వార్తా విశేషాలపైనా ఒక క్విజ్ నిర్వహించడం ద్వారా పిల్లలు వాటి పట్ల మరింత ఆసక్తి పెంచుకునే అవకాశం ఉంది.

## హోంవర్క్‌లు

పిల్లలు నేర్చుకోవడమనేది నిరంతరం. బడిలోనైనా, ఇంటి వద్దనైనా అది అర్థవంతంగా, సంతోషకరంగా సాగాలి. ఒక విషయం గురించి పిల్లలు నేర్చుకునే ప్రక్రియలో ఉన్నప్పుడు, ఏ పని తరగతిలో జరగాలి, ఏ పని ఇంటివద్ద జరగాలి అని ఆలోచించడం ముఖ్యం. అప్పుడు ఎంత మోతాదులో పిల్లలు ఇంటివద్ద సమయం వెచ్చించగలరో కూడా ఆలోచించాలి. హోంవర్క్‌లు పిల్లలు ఇంట్లో ఉండే సమయాన్నంతటినీ కబళించేయకూడదు. అమ్మ నాన్నలతో ఇరుగుపొరుగు వారితో గడిపేందుకు మా పిల్లలకు సమయం లేదనీ, వాళ్ళకు హోంవర్క్ ఉంటుంది కాబట్టి చిన్న పని కూడా చెప్పడానికి వీల్లేదని, ఇంటికి బంధువులు వస్తే మాట్లాడడం వల్ల సమయం వృధా అవుతుంది కాబట్టి తలుపులు వేస్కొని చదువుకోమని చెప్తామని, టైమ్ మిగల్చడానికి అన్నం కలిపి తామే తినిపిస్తామని, వగైరా వగైరా నిత్యం బడి పిల్లల తల్లితండ్రులు ఎవరైనా చెప్పవలసి వస్తుంటే, వారి పిల్లలు, వాళ్ళ భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నట్లే!

పిల్లలకు ఇంటి వద్ద రెండవ తరగతి దాకా హోంవర్క్ ఉండకూడదని, నాల్గవ తరగతి దాకా అయితే బాగుంటుందని, అసలే ఉండకపోతే బాగుంటుందని, లేదా ఉండాలనీ అనేక రకాల అభిప్రాయాలు ఉన్నాయి. అయితే విషయం ఉండాలా లేదా అన్న దానికంటే, ఏం ఉండాలి? ఎలా ఉండాలి? ఎంత ఉండాలి? అన్నది ప్రధానంగా భావిస్తాం.

హోంవర్క్ లేదా హోంఆక్టివిటీ. ఎలా పిలిచినా.. అది కొత్త పాఠ్యాంశానికి పిల్లల్ని సిద్ధం చేసేదిగా ఉండవచ్చు, తరగతిలో జరిగిన అంశానికి కొనసాగింపుగా ఉండవచ్చు లేదా ఓ కొత్త విషయాన్ని తెలుసుకోవడం అయిఉండవచ్చు. హోంవర్క్‌లు

యాంత్రికంగా, నిరుపయోగంగా, నిరుత్సాహంగా ఉండకూడదు. పిల్లల కుతూహలం, ఆలోచన, అవగాహన, నేర్చుకున్న విషయాన్ని అప్లయ్ చేయడం, నైపుణ్యాలు లాంటివి హోంవర్క్ ద్వారా మెరుగుపడాలి. ఉదాహరణకు కొన్ని హోంవర్క్‌లు ఇలా ఉంటాయ్...

- ఒక ఎల్‌కేజీ పిల్లవాడు రంగులునేర్చుకుంటున్న క్రమంలో, తన ఇంటిలో నారింజరంగులో ఉన్న వస్తువులను రెండు వెతికి తెమ్మనటం...
- మూడో తరగతి పిల్లలు సైన్స్ పాఠంలో నోటి శుభ్రత నేర్చుకుంటుంటే తమ కుటుంబంలో, తమ ఇరుగుపొరుగు ఇళ్ళలో ఎంతమందికి రాత్రి పడుకునే ముందు పళ్ళు తోముకునే అలవాటు ఉంది? ఎంతమందికి పుచ్చుపళ్ళు ఉన్నాయి? వంటి వివరాలు సేకరించడం...
- ఐదో తరగతి పిల్లలు తమకు ఇచ్చిన అసంపూర్ణమైన కథను చదివి, దానికి ముగింపు ఇవ్వడం...
- ఆరవ తరగతి పిల్లలు కొలతలు పాఠంలో భాగంగా తమ ఇంటిలోని గదుల పొడవు, వెడల్పులు కొలిచి, వైశాల్యాలు తెలుసుకోవడం...
- జరుగుతున్న పాఠంలోని కఠినమైన పదాలకు డిక్షనరీలో వెదికి అర్థాలు తెలుసుకోవడం...

ఈ విధంగా ఇంటివద్ద పిల్లలు చేసే ఏ పనైనా వాళ్ళ సొంత ఆలోచనతో చేయవలసి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో ఏ వ్రాతపనైనా ఒక చిన్న షీటు మీద చేసేదిగానే ఉంటుంది. కాబట్టి ఒకటో రెండో షీట్లు, చదవడానికి లైబ్రరీనుండి తీసుకున్న ఏదైనా ఒక పుస్తకం ఇంటికి తీసుకువెళ్తారు. ఇరవై నిమిషాలనుండి ముప్పై నిమిషాల వరకు వీళ్ళు ఇంటివద్ద పనిచేస్తారు. హైస్కూల్లో తరగతిలో తెలుసుకున్నవి మరలా ఇంటివద్ద చదవడం, చదివినవి మననం చేసుకోవడం, లెక్కలు చేయడం, సొంతంగా వ్రాయడం, బొమ్మలు వేయడం వంటి నైపుణ్యాల సాధన కూడా ఉంటాయి. కాబట్టి హోంవర్క్ ఒక ప్రణాళిక ప్రకారం ఆరవ తరగతికి ఒక గంట మొదలుకొని, పదవ తరగతికి రెండున్నర నుండి మూడు గంటల పని

ఉండేట్లు ఇవ్వడం జరుగుతుంది. ఇచ్చిన పనినిబట్టి ఎన్ని రోజుల వ్యవధిలో ముగించాలన్నది నిర్ణయిస్తారు.

## ప్రాజెక్టులు

ప్రాజెక్టులు ముఖ్యంగా నేర్చుకోవడంలో చాలా కీలకమైన పాత్ర వహిస్తాయి.



ప్రాజెక్టు అనే పని విస్తృతమైనది. ఒక ప్రాజెక్టు చేయడం ద్వారా పిల్లలకు ఆ విషయం పట్ల ఒక క్రొత్త అవగాహన ఏర్పడాలి, తెలిసిన విషయం మరింత లోతుగా, విశాలంగా తెలియాలి. ఆ విషయంతో తమకు సంబంధం ఏర్పడాలి. నిత్యజీవితంలో ఆ అంశంయొక్క ప్రభావం ఎక్కడ ఎలా వస్తుందో తెలియాలి.

ప్రాజెక్టు చేస్తున్న ప్రక్రియ దాని ఫలితంకన్నా చాలా ముఖ్యమైనది. ప్రాజెక్టుకు సంబంధించిన ఆలోచన, అవగాహన, నైపుణ్యాలు అన్నీ పిల్లల ని ా ం త ఎ ా ు న ఎ ా ు ఉండాలి. పుస్తకాలులేదా ఇంటర్నెట్‌నుండి విషయాన్ని ఉన్నది ఉన్నట్లు రాసింది ప్రాజెక్టు కానే కాదు. ఈ ప్రక్రియలో విద్యార్థి ఒక సైంటిస్టులా శోధించాలి. తనకు కావలసిన సమాచారాన్ని వివిధ వనరులనుండి సేకరించగలగాలి. దాన్ని క్రోడీకరించుకొని ఒక క్రొత్త అవగాహనను పొందిన సంతోషాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. ప్రశ్నలు వేసుకోవాలి. సమాధానాలు వెతుక్కోవాలి. ప్రయోగాలు చేయాలి. తప్పులు చేయాలి. వాటిని విశ్లేషించుకుని మళ్ళీ ప్రయత్నించాలి. టీచర్లతో, తెలిసిన ఇతర పెద్దలతో చర్చించాలి. ఒక సమస్యను పలు కోణాలనుంచి ఆలోచించగలగాలి. ఇటువంటి ఎన్నో అనుభవాలు, అనుభూతులు ప్రాజెక్టులు చేస్తున్నప్పుడు పిల్లలకు కలగాలి. ఒక్కమాటలో 'స్వతంత్రంగా' నేర్చుకోగలగాలి.

చివరగా తను తెలుసుకున్న విషయాన్ని వ్రాతపూర్వకంగా లేదా సృజనాత్మకంగా

చార్టు లేదా మోడల్ రూపంలో రికార్డ్ చేయాలి. ఇతరులతో తన జ్ఞానాన్ని పంచుకోగలగాలి. ఈ విధంగా ఉండేలా ప్రాజెక్టులు ఒక్కరే లేదా జతలలో, బృందాలలో చేసే విధంగా టీచర్లు, పిల్లలు కలిసి చర్చించుకుని రూపొందించు కొంటారు. ప్రాజెక్టు పూర్తయ్యాక దానిని తన తరగతి పిల్లలు, టీచర్ల ముందు, కొన్నిసార్లు ఇతర తరగతుల పిల్లల ముందు కూడా ప్రదర్శించి వివరిస్తారు. (ప్రాజెక్ట్ ప్రజెంటేషన్).

## భారంకాని బ్యాక్‌ప్యాక్స్

చదువు నిజంగా బరువైపోయింది ఈ రోజుల్లో. పిల్లల ఆరోగ్యం అంటే ఏమాత్రం పట్టని విధంగా బడులు పుస్తకాల సంఖ్యను, బ్యాగు బరువును పెంచుకుంటూ పోతుంటే, ఎన్ని పుస్తకాలు మోస్తే అంత మంచి చదువని తల్లితండ్రులు మురిసిపోతున్న అన్యాయమైన పరిస్థితి. బలైపోతుంది మాత్రం చిన్నారుల లేత వెన్నెముకలు, వారి ఆరోగ్యం. పిల్లల బ్యాగుల బరువు తగ్గించాల్సిన బాధ్యత ఖచ్చితంగా బడులదే. అందుకు చాలా తీవ్రమైన కృషినే మేము చేయాల్సివచ్చింది.

ఎల్‌కేజీలోనే అరడజను సబ్జెక్టులు చెప్పే సంస్కృతికి మొదటినుంచి అభ్యాసవిద్యాలయం విరుద్ధం. ఎల్‌కేజీ, యుకేజీ పిల్లలకు తరగతులలో పాఠ్యపుస్తకాలు అనేవి ఉండవు. ఏదైనా వ్రాస్తే కాగితాలమీద రాస్తారు. కాబట్టి వారి బ్యాగులలో ఒక లైబ్రరీ పుస్తకం, ఒకటో రెండో షీట్లు మాత్రమే ఉంటాయి. ఒకటినుండి ఐదవతరగతి పిల్లలకు పాఠ్యపుస్తకాలు బడిలోనే ఉంటాయి. కావలసిన వారు ఇంటివద్ద కూడా ఒక సెట్ కొని పెట్టుకుంటారు. లేదా దాని ఫోటో కాపీ తీసిన ఒక షీటుని ఇంటికి తీసుకువెళతారు. నోటు పుస్తకాలు కూడా వీళ్ళకి ఉండవు. కాబట్టి వీరి బ్యాగు బరువు కూడా ఇంచుమించుగా ఎల్కేజీ బ్యాగంతే ఉంటుంది. ఇక పై తరగతుల పిల్లలు ఇంటివద్ద పాఠ్యపుస్తకాలు చదవడం, వాటికి సంబంధించిన హెూంవర్క్‌లు చేయడం అవసరం కాబట్టి, వారికి పాఠ్యపుస్తకాలు, నోట్సులు కూడా ఉంటాయి. మరి అన్ని పుస్తకాలు ఉంటే తప్పకుండా బరువు చాలా ఉంటుంది. దీనికి పరిష్కార మార్గంగా వారికి బడిలో ఒక సెట్టు, ఇంటి వద్ద ఒక సెట్టు పాఠ్యపుస్తకాలు

ఉంటాయి. దీనివల్ల పాఠ్యపుస్తకాలు మోసే పని లేదు. నోట్సులు వంద పేజీల పుస్తకాలకు మాత్రమే పరిమితం చేయడం వల్ల ఇంకా కొంచెం బరువు తగ్గింది. ఈ విధంగా పిల్లల వీపులనుంచి భారాన్ని చాలావరకే తగ్గించగలిగాం!

## క్రాఫ్ట్



తమ ఊహల్లోని ఆలోచనకు పేపరు, మట్టి, చెక్కలాంటి పదార్థాలను కానీ, వస్తువులను కానీ ఉపయోగించి ఒక ఆకృతిని ఇవ్వడం క్రాఫ్ట్. ఒక పాట వ్రాయడం, ఒక బొమ్మగీయడంలాగే ఇది కూడా పిల్లలలోని భావవ్యక్తీకరణకు అద్భుతమైన మార్గం. దీనికి సృజనాత్మకతతో పాటు నైపుణ్యాల అవసరం ఎక్కువ ఉంటుంది.

అభ్యాసవిద్యాలయంలో క్రాఫ్ట్ పని ఎల్.కే.జీ.నుండి పదవ తరగతి వరకు కరిక్యులమ్‌లో భాగం. వారానికి మూడు పీరియడ్లు తప్పకుండా ఉంటాయి. 1–2 తరగతులకొచ్చే సరికి పిల్లలు కత్తెరతో చాకచక్యంగా తాము కోరుకున్న ఆకృతులను కత్తిరించగలుగుతారు. ఏడెనిమిది తరగతులకొచ్చే సరికి చాలామంది పిల్లలు తమ ఆలోచనలకు ఖచ్చితమైన రూపాన్నివ్వగలిగేంతగా ఆరితేరిపోతారు.

బంకమట్టి, పేపరు, చెక్క, కార్డ్‌బోర్డ్, లోహాలు, గుడ్డ, ప్లాస్టిక్... ఇలా రకరకాల మాధ్యమాలను పిల్లలు వాడితే వారికి ఆ పదార్థాల లక్షణాలు బాగా అర్థమవుతాయి. వాటిని వాడడంలో మెళకువలు తెలుస్తాయి. తమ ఆలోచనకు అనువైన మాధ్యమాన్ని ఎంచుకోగలుగుతారు.

బంకమట్టి, కృత్రిమ రంగుమట్టి ఎల్.కే.జీ. నుంచీ పిల్లలకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాయి. పిల్లలు వాటిని మలచే తీరు ఆశ్చర్యపరుస్తుంది. నైపుణ్యం కన్నా ఆలోచన, ఒక భావం ప్రతిఫలించే విధంగా ఉంటాయి వాళ్ళు చేసే ఆకృతులు. త్వరలో కుమ్మరిచక్రాలపై కుండలు చేయడం ఒక ప్రత్యేకమైన ఆక్టివిటీగా ప్రవేశ పెట్టనున్నాము.



పాపప్‌వర్క్, ఒరిగామి, క్విల్లింగ్, కొలాజ్, ఫ్రేమ్‌ల తయారీ, 3డి పేపర్ క్రాఫ్ట్ వంటి వాటిలో పిల్లలు వారి వయసుకు మించిన నైపుణ్యాన్ని సాధించారు. పాపప్ వర్క్, 3డి పేపర్‌క్రాఫ్ట్ వంటివి చేయడానికి గణిత సంబంధమైన జామితి లాంటి భావనలపై స్పష్టత అవసరం. ఆ స్పష్టత క్రాఫ్టులో తప్పులు చేస్తూ, వాటిని సరిచేసుకుంటూ పోవడంలో అసంకల్పితంగా వస్తుంది. ఖచ్చితమైన స్పష్టత, నైపుణ్యంతో కత్తిరించడం, మడవడం, అంటించడం లాంటివి చెయ్యవలసి వస్తుంది. గణితంలో నేర్చుకున్న భావనలకు రూపమివ్వడానికీ, క్రాఫ్ట్ చేస్తూ ఏర్పరుచుకున్న స్పష్టత వల్ల గణితం త్వరగా అర్థం చేసుకోవడానికి రెంటికీ అవకాశం ఉంటుంది.

మూతలు, ప్లాస్టిక్‌సీసాలు, గ్లాసులు, ప్లేట్లు, ట్యూబులు వంటి వాడిపారేసే వస్తువులతో రకరకాల ఆకృతులను, పెన్‌స్టాండ్‌ల వంటి ఉపయోగపడే వస్తువులనుగానీ చేస్తారు.

క్రాఫ్ట్ చేయడంలో తప్పులు చేయడం, వాటిని సరిదిద్దుకుని మరల ప్రయత్నించడం, క్రొత్త సమస్యలు ఎదురవడం, వాటిని సాధించడానికి ప్రయత్నించడం, ఏకాగ్రత పెరగడం లాంటి అదనపు విలువలెన్నో ఉన్నాయి. అంతిమంగా ఏం తయారైంది అనే దానికన్నా, అది చేసే క్రమంలో వాళ్ళలో కలిగే స్పందనలు, మార్పులు ప్రాధాన్యంగలవి. క్రాఫ్టురూం గోడలకుండే డిస్‌ప్లే బోర్డులో, అలమారలలో ఎప్పటికప్పుడు పిల్లలు చేసిన క్రాఫ్టువర్కులను ప్రదర్శిస్తుంటారు. వారికి కావలసిన సామగ్రి అంతా ఆ గదిలోనే ఉంటుంది.

టీచరు కూడా పిల్లలతో కలసి క్రాఫ్ట్‌వర్క్ చేస్తారు. ఒక టెక్నిక్ ఒక తరగతి పిల్లలకు నేర్పితే, వారితో కలిసి చేయడం ద్వారా మిగిలిన పిల్లలు తేలికగా నేర్చుకుంటారు. టెక్నిక్ ఒకటే అయినా, ఎవరి ఆలోచన వారిది, ఎవరి పద్ధతి వారిది, ఎవరి ఆకృతి వారిది.

ఈ నైపుణ్యాలని పిల్లలు ఎన్నో సందర్భాలలో ఉపయోగిస్తుంటారు. సబ్జక్టులకు సంబంధించిన ప్రాజెక్టులలో చార్ట్‌లుగానీ, మోడల్స్‌గాని, తయారు చేసేటప్పుడు వారికి వినూత్నమైన ఆలోచనలు వస్తాయి. సృజనోదయం, బాలలదినోత్సవం, సందడి లాంటి కార్యక్రమాల్లో వారికి కావలసిన వస్తువులు, నగలు వారే చేసుకోగలుగుతారు. ప్రతి సంవత్సరం లయోలాకాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే కళాసంతలో పాల్గొంటున్న ఒకే ఒక్క స్కూలు అభ్యాసవిద్యాలయం. ఎంతోమంది చెయ్యితిరిగిన, నిష్ణాతులైన కళాకారుల ఆకృతులు మాత్రమే ప్రదర్శనకు ఉండే ఈ సంతలో చోటు సంపాదించడం విశేషం.

పిల్లల ఊహలకు రూపాన్నిచ్చే, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచే క్రాఫ్టు వారు స్వతంత్రంగా ఎదగడంలో ఎంతో దోహదపడుతుందనడంలో సందేహం లేదు.

## లంచ్ కబుర్లు

మధ్యాహ్నభోజన విరామం 40 నిమిషాలు ఉంటుంది.ప్రాథమిక స్థాయిలో క్లాసు టీచర్లు తప్పనిసరిగా తమ తరగతి పిల్లలతో కలిసి భోజనం చేస్తారు. హైస్కూలు టీచర్లకు ఈ నియమం వర్తించకపోయినా, వారు ప్రతిరోజూ ఏదో ఒక తరగతి పిల్లలతో కలిసి భోజనంచేయడాన్నే ఇష్టపడతారు. లంచ్‌టైమ్ చాలా ప్రత్యేకమైనది.

పిల్లలు, టీచర్ల మధ్య పాఠం ప్రసక్తి ఉండదు. 'ఒకరే మాట్లాడాలి, అందరూ వినాలి', 'గట్టిగా మాట్లాడకూడదు' అనే నియమాలు ఉండవు. బోలెడన్ని కబుర్లు, జోకులు, ఫిర్యాదులు, చర్చలు జరిగిపోతాయి ఆ నలభై నిమిషాలలో. పంచుకుని తినడంలో దగ్గరతనం పెరుగుతుంది. పిల్లలకు, టీచర్లకు మరింత స్నేహం పెరిగేందుకు ఈ సమయం చాలా విలువైనది. పిల్లల ఆహారపు అలవాట్లను గమనించడం, వాటి గురించి మాట్లాడుకోవడం, సలహాలు ఇవ్వడం, అవసరమైతే ఒకోసారి తల్లితండ్రులతో మాట్లాడటం కూడా జరుగుతుంది.

**సమిష్టి బాధ్యతలు**



శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదన్నారు. పనిచేయడం అవసరమే కాదు. ఒక విలువ కూడా. నిత్యజీవితంలో తమ పనులను తాము చేసుకునే నైపుణ్యం పిల్లలకు వాళ్ళపైన నమ్మకాన్ని, గౌరవాన్ని ఇస్తుంది. బడి ఆవరణను తరగతులను శుభ్రంగా ఉంచడం మొదలుకొని, మొక్కలు పెంచడం, వాటికి నీళ్ళ పట్టడం, వాటి సంరక్షణ, లైబ్రరీ, సైన్సు లాబ్‌లను పద్ధతిగా, శుభ్రంగా ఉంచడం వరకు ఎన్నో శారీరక శ్రమతో కూడిన పనులను పిల్లలు ప్రతినిత్యం చేస్తారు. బడి అనేది సమిష్టిజీవనం కాబట్టి, బాధ్యతలు కూడా అంతే! అవసరాన్నిబట్టి గోడలకు వెల్లవేయడం దగ్గరనుంచి, సిమెంటు బెంచీలు కట్టడం, బ్లాక్‌బోర్డులకు రంగు వేయడం వంటి పనులు కూడా పెద్దల ఆధ్వర్యంలో వారు ధీమాగా చేసేస్తారు. చీపురు పట్టుకోవడం,

చేతులు, బట్టలు మట్టితో మురికి చేసుకోవడం తక్కువ పనులని అనుకొనే సందర్భమే మా బడిలో రాదు. వంతులవారీగా, బృందాలలో – అన్ని పనులూ, అందరూ ప్రతిరోజూ చేస్తారు.

దీనిద్వారా 'పరిశుభ్రత' అంటే చెత్తను శుభ్రం చేయడమే కాదు, చెత్తను వేయకుండా ఉండడమనే స్పృహ, 'మన పరిసరాలు మన బాధ్యత' అన్న భావన, పనిపట్ల గౌరవం పిల్లలలో కలుగుతాయని మా నమ్మకం.

**అతిథులతో ముఖాముఖి**



స్వంత అనుభవాలు నేర్పేవి కొన్నైతే, ఇతరుల అనుభవాలనుండి నేర్చుకోదగ్గవి మరెన్నో. నిత్యం మన చుట్టూ ఎందరో వ్యక్తులు. సమాజం సజావుగా నడవాలంటే ఎంతోమంది వ్యక్తుల ఆలోచనలు, ఎంతోమంది శ్రమ అవసరం. పిల్లలకు ఆ విలువ తెలియాలి. వివిధరంగాలకు చెందిన వ్యక్తులతో స్వయంగా ముఖాముఖీ సంభాషించడం ద్వారా పిల్లలు సమాజనిర్మాణంలో ఎంతమంది పాత్ర ఉందో తెలుసుకుంటారు. అతిథులతో ముఖాముఖీ కార్యక్రమం అవకాశాన్నిబట్టి ఎంత తరచుగానైనా జరిగే కార్యక్రమం. ఓ కార్పెంటర్, మెకానిక్, కవి, డాక్టర్, పెయింటర్, యాత్రికుడు, రచయిత,

మెజీషియన్... ఇలా ఈ కార్యక్రమంలో విభిన్నమైన వ్యక్తులు లెక్కకుమిక్కిలిగా పాల్గొన్నారు. వారితో సంభాషించడం పిల్లలకు ఎంతో స్ఫూర్తిదాయకం. విజ్ఞానదాయకం.

ట్రావెలర్స్ డా॥ఆదినారాయణ, దాసరి అమరేంద్ర, పరవస్తు లోకేశ్వర్ మొదలైన వారు తమ యాత్రానుభవాలను పంచుకున్నారు. విశాలాంధ్ర ఎడిటర్ రాఘవాచారి గారు తెలంగాణా విభజన పూర్వాపరాలపై చర్చించారు. రచయిత మహమ్మద్ ఖదీర్‌బాబు గారు, కవి వారణాసి వెంకట్రావు గారు, నాసా సైంటిస్ట్ రవిగారు, లైబ్రరీ అసోసియేషన్ సెక్రటరీ రావి శారదగారు, పద్మశ్రీ ఎస్.వి.రామారావుగారు, సైక్లిస్ట్ సతీష్, వీధినాటిక దర్శకులు శాంతారామ్‌గారు, గాయని కీర్తన, స్వచ్ఛ చల్లపల్లి వ్యవస్థాపకులు డిఆర్‌కె ప్రసాద్ గారు... ఇంకా అనేకమంది “అతిథులతో ముఖాముఖి”లో పాల్గొని, తమ అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు.

ఇష్టపడ్డ రంగంలో కృషిచేస్తే ఎంత ఆత్మసంతృప్తితో, ఆత్మవిశ్వాసంతో, గౌరవంతో జీవించవచ్చో పిల్లలకు వారి ద్వారా అర్థమవుతుంది. మనకు తెలిసిన మెడికల్, ఇంజనీరింగ్ లాంటివే జీవితానికి మార్గాలు కాదని, చిన్నతనంనుంచి తమ అభిరుచులను, శక్తులను తెలుసుకుని వాటిని పదునుపెట్టుకునే దిశగా అనేక మార్గాలలో వృత్తిపరంగా కూడా రాణించవచ్చని నమ్మడానికి వాళ్ళకి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. రకరకాల వృత్తులలోని అవకాశాలు, వాటికి అవసరమయ్యే నైపుణ్యాలు, వాటిలోని సాధకబాధకాలు, సవాళ్ళు, సంతోషం, అన్నీ దీని ద్వారా తెలుసుకుంటారు. లెక్కలు, సైన్సు రాకపోతే చదువు రానట్లేనని అందరూ అనుకోవడం ఒక అపోహ మాత్రమే అని, తమ బలాలను తెలుసుకొని, వాటిపై దృష్టి పెట్టగలిగేవారు ఆ రెండూ రాకపోయినా అద్భుతంగా రాణించగలరని తెలుస్తుంది.

**క్షేత్రపర్యటనలు, ఫీల్డుట్రిప్పులు**

నాలుగు గోడల మధ్య కేవలం పుస్తకాలనుంచి వచ్చే జ్ఞానం అసంపూర్ణమైనది. క్షేత్రపర్యటనలు / ఫీల్డుట్రిప్పులు ఆ జ్ఞానానికి మరింత స్పష్టతనిస్తాయి. ఇంటర్నెట్ యుగంలో యూ-ట్యూబ్‌లో మనం చూడలేనిది లేదు, వెళ్ళలేని ప్రదేశం లేదు. మరి

క్షేత్రపర్యటనల అవసరం ఉందా అనే సందేహం రావచ్చు. క్షేత్రపర్యటనలు పిల్లలకు ప్రత్యక్ష అనుభవాన్ని, అనుభూతిని ఇస్తాయి. అక్కడి మనుషులతో సహజవాతావరణంలో సంభాషించవచ్చు. వ్యవసాయం గురించి పాఠ్యపుస్తకాల్లో చదవడం, దాని గురించి ఇంటర్నెట్ సాయంతో మరింత తెలుసుకోవడం, యూట్యూబ్‌లో ఆ ప్రక్రియలన్నింటినీ విపులంగా చూడటం, ఇవన్నీ తప్పక మంచి అవగాహననే ఇస్తాయి. అయితే పొలానికి వెళ్ళి ఆ మట్టిని, ఆ మొక్కలను సజీవంగా తాకి అనుభూతి చెందడం, అక్కడి రైతులతో సంభాషించి వివరాలు సేకరించడం ద్వారా వచ్చే అవగాహన మనసులో నాటుకుపోతుంది.



క్షేత్రపర్యటనలు సందేహాలను తీర్చడమే కాదు, ప్రశ్నలను రేకెత్తిస్తాయి కూడా, చదివినదానికి కొన్నిసార్లు చూసినది భిన్నంగా అనిపించవచ్చు. పుస్తకాలలో లేని కొత్త విషయాలు తెలియవచ్చు. పిల్లలకు దరిదాపు అన్ని సబ్జెక్టులలో చాలావరకు అంశాలను క్షేత్రపర్యటనల ద్వారా చెబితే అద్భుతంగా ఉంటుంది. కానీ సమయ, ఆర్థిక, ఇతర పరిమితుల వల్ల అది ఆచరణ సాధ్యం కాదు. కాబట్టి వీలునుబట్టి, అవసరాన్నిబట్టి ఫీల్డుట్రిప్పులకు తీసుకువెళ్ళడం జరుగుతుంది. పాఠ్యాంశాలకు సంబంధించినవే అయి ఉండాలనే నియమం లేదు. నగరంలో జరిగే సైన్సు, క్రాఫ్టు, ఆర్టు ఎగ్జిబిషన్లు, ప్రత్యేకమైన నాటకాలు, ప్రముఖుల ప్రసంగాలు వంటి వాటికి

కూడా తీసుకువెళ్ళడం జరుగుతుంది. ఏ పర్యటనకైనా వెళ్ళేముందు దాని గురించి మాట్లాడుకోవడం, పాఠ్యాంశాలకు సంబంధించినవైతే వాటి గురించి విస్తృతంగా ముందే తెలుసుకోవడం, తిరిగివచ్చాక సమీక్షలు రాయడం తప్పనిసరి. నిర్మల హృదయ భవన్, సైన్స్ మ్యూజియం, విక్టోరియా మ్యూజియం, కోల్డ్‌స్టోరేజ్, మేరీమాత కొండ, పోరంకి పొలాలు, ఉప్పలపాడు బర్డ్స్‌శాంచురీ, మంగళగిరి చేనేత పరిశ్రమ లాంటివి పిల్లలు చూసి వచ్చిన ప్రదేశాలు.

**ఎరుక**



కొన్ని విషయాలు తెలుసుకోకపోయినా ఫర్వాలేదు. కొన్ని కొంత తెలిస్తే చాలు. కానీ మన జీవనం, మన పరిసరాలు, సమాజం ఇంకా జీవులన్నింటి మనుగడకు సంబంధించిన విషయాలు ఉంటాయి. వాటిని అరకొరగా, ముక్కలుముక్కలుగా, అసంపూర్ణంగా కాకుండా పూర్తిగా, సమగ్రంగా, క్షుణ్ణంగా, విస్తారంగా తెలుసుకోవాలి. అలా తెలుసుకున్నవి మనసులో నాటుకుంటే ఆ విషయాలపట్ల పిల్లల దృక్పథం, తీరులో మార్పు రావచ్చు. ఇలాంటివి మన బడిపిల్లలే కాక, వీలైనంతమందికి తెలియచెప్పాలి. ఈ ఉద్దేశ్యంతో మొదలైంది "ఎరుక".

ఇంతకుముందు పిల్లలు ఆ సంవత్సరం పొడవునా అన్ని సబ్జక్టులలో చేసిన

ప్రాజెక్టులు, మినీ ప్రాజెక్టులు, క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ వర్క్‌ల వంటివన్నీ తల్లితండ్రుల కోసం ఒకరోజు ప్రదర్శించడం జరిగేది. ప్రాథమిక తరగతులలో ఇప్పటికీ అదే కొనసాగుతోంది. 2015–16 సంవత్సరంలో హైస్కూలుకు సంబంధించి ఎరుకలో పైన చెప్పిన మార్పు చేయడం జరిగింది. ఆ సంవత్సరం **'కాలుష్యభూతం'** అన్న అంశం తీసుకుని 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న పిల్లలు (10వ తరగతి పిల్లలు ఫిబ్రవరి నెలలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతూ ఉంటారు కాబట్టి వారు పాల్గొనడం వీలుకాదు) టీచర్లు కలిసి ఆ అంశాన్ని గురించి విస్తారంగా తమకు తెలిసినదంతా ఒకరోజుపాటు చర్చించారు. తర్వాత మరింత తెలుసుకోవడానికి ఏమేం వనరులు ఉపయోగించవచ్చో మాట్లాడుకున్నారు. చిన్నచిన్న అంశాలు, అనుఅంశాలుగా విభజించుకొని, తరగతివారీగా, జతలలో తమకు అనువైన, నచ్చిన విషయాన్ని ఎంపిక చేసుకున్నారు, స్కూలు లైబ్రరీ / ఇంటర్నెట్‌ల నుండి సేకరించిన సమాచారంతో పోస్టర్లు, మోడల్స్, ఛార్టులు చేశారు. దానిని ఇతరులకు వివరించడం ఎలానో సాధన చేశారు. ఒకరోజు అందరూ అందరికీ తమ ప్రాజక్టులను ప్రదర్శించి, వివరించారు. దీనివల్ల అందరికీ విషయం మొత్తంమీద సమగ్ర అవగాహన ఏర్పడటానికి అవకాశం వచ్చింది. ఒకరోజు ప్రాథమిక తరగతి పిల్లలకు, టీచర్లకు వివరించారు. బడి చుట్టుప్రక్కల ప్రాంతంలోని ఇళ్ళకు వెళ్ళి ఎరుక యొక్క ప్రాధాన్యతను వివరించి, ఆ ప్రదర్శనకు ఆహ్వానించారు. ఎరుక నిర్వహించిన రోజున బడిపిల్లల తల్లితండ్రులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలనుంచి పిల్లలు, పెద్దలు అంచనాకు మించిన సంఖ్యలో వచ్చారు.

- ♦ భూమిమీద ఉన్నవనరులు, జీవరాశుల మధ్య సంబంధం...
- ♦ సహజవనరులను మానవులు విచక్షణా రహితంగా వాడేయడం వలన, వాటిని కలుషితం చేయడం వలన జరిగిన, జరుగుతున్న, జరగబోయే అనర్థాలు...
- ♦ ప్లాస్టిక్ వాడకం – ముఖ్యంగా వాడిపారేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, జంతువులకు, మనుషులకు కలుగుతున్న అనర్థాలు...
- ♦ వివిధ రకాల మానవ జనిత కాలుష్యాలు, కారణాలు, వాటికి పరిష్కారమార్గాలు...

♦ మన ఆరోగ్యం, మనుగడ కాపాడుకోవడంకోసం ముందుతరాల వారికి భద్రమైన కాలుష్యరహిత భూమిని మిగల్చడానికి నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ చేయవలసిన, చేయగలిగే, చేయకూడని పనులు...

ఇలాంటి ఎన్నో విషయాలపైన తాము చేసిన చార్టులు, మోడల్స్, పోస్టర్లతో ఆరోజు సందర్శకులకు ఉత్సాహంగా, ఆసక్తికరంగా వివరించారు. ఆ విషయంలో ఇంటివద్ద వ్యక్తిగతంగా వారుకూడా తమ రోజువారీ పనులలో పర్యావరణానికి చేటుచేసే వాటిని తగ్గించుకోవాలని అనుకున్నారు. బడి ఆవరణలోకి వాడిపారేసే ప్లాస్టిక్ సంచులు నిషేధించాము. బడికి తెచ్చుకునే చిరుతిండ్లలో ఫాస్ట్ ఫుడ్ ఉండకూడదని, ఆరోగ్యకరమైన, ఇంటివద్ద తయారైనవి తెచ్చుకోవాలని తీర్మానించాము. ఈ విధంగా ప్రతి సంవత్సరం ఒక అంశంపైన విస్తృతంగా పనిచేస్తే దానిప్రభావం తప్పక కొంతమంది పైన అయినా ఉంటుందన్న నమ్మకం.

## పుట్టినరోజులు

ఏ పిల్లలనైనా సంవత్సరంలో అత్యంత ఇష్టమైన రోజు ఏదంటే తమ పుట్టినరోజు అని ఠక్కున చెప్తారు. తమకొకరికే ప్రత్యేకమైన ఆ రోజును చాలా ప్రత్యేకంగా జరుపుకోవాలని వారు ఉత్సాహపడతారు. కానీ పుట్టినరోజు పేరిట ఇళ్ళలో, బడులలో జరిగే ఆర్భాటాలు, ప్రదర్శించే ఆడంబరాలు పిల్లలపై చాలా చెడుప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. వ్యక్తిగత అభిప్రాయాలు ఎలా ఉన్నా బడిలో అటువంటి సంబరాలు, ఖరీదైన బహుమతులు పంచి పెట్టడం వంటివి పిల్లలలోని తేడాలను వేలెత్తి చూపిస్తాయి. కొందరి సరదా కొంతమందిలో ఆత్మన్యూనతా భావాన్ని రేకెత్తించవచ్చు. ఈ పరిస్థితులేవీ రాకుండా ఉండడానికి బడిలో వీలైనంత ప్రయత్నం జరుగుతుంది. పుట్టినరోజునాడు పిల్లలు కొత్త బట్టలలో బడికిరావచ్చు. నిరాడంబరంగా కనిపించడానికి పిల్లల్ని ప్రోత్సహిస్తాం. చాక్లెట్లు, కేక్‌లు, స్వీట్లు, ఖరీదైన బహుమతులు పంచడానికి ఏమాత్రం అనుమతి లేదు. తమ టీచర్లకు, తోటి తరగతి పిల్లలకు సాధారణంగా వాడుకునే పెన్నులు, పెన్సిళ్ళు మాత్రం ఒక్కొక్కటి పంచవచ్చు. సృజనోదయంలో అందరు పిల్లలు పాటపాడి అభినందిస్తారు. అదే బోలెడంత సంతోషం. ఇదికాక ప్రత్యేకంగా ఏమైనా

చేయదలచుకున్నవారు బడిలో పిల్లలందరికీ ఉపయోగించే బహుమానం ఏదైనా ఇవ్వవచ్చు. సాధారణంగా పిల్లలు ఆరోజు మొక్కలు కొని తెచ్చి నాటడం, ఆటవస్తువులు, లైబ్రరీకి పుస్తకాలు కొనివ్వడం కానీ చేస్తుంటారు. కొంతమంది అతి సాధారణంగా బడికి వస్తారు. ఏ బహుమతులూ ఇవ్వరు. ఒకరు చేశారని తామూ చేయాలనో, ఒకరిని మించి మరొకరు చేయాలనో లాంటి మానసికమైన ఒత్తిడికి మా పిల్లలు లోనుకారన్నది స్పష్టమవుతుంది. మాకు సంతోషమవుతుంది.

ఆరవ తరగతి చదివే ఓ పాప తన పుట్టినరోజునాడు కొత్తబట్టలకు పెట్టే ఖర్చును తగ్గించి, స్కూలు ఆడియోవిజువల్ థియేటర్‌కు కర్టెన్‌లు కుట్టించమని వాళ్ళ నాన్నని కోరింది. ఇంతకంటే స్ఫూర్తిదాయకమైన విషయం ఏముంటుంది?

**డిబ్బీబ్యాంక్ :**

కొంతమంది పిల్లలకి ఏది కావాలంటే అది అమ్మానాన్నలు వెంటనే కొనిపెడతారు, కొంతమంది పిల్లలు తమ పాకెట్ మనీలోంచి ఖర్చుపెడతారు. మరికొంతమందికి తమ అవసరాలకు సైతం కావలసినప్పుడు డబ్బులు ఉండకపోవచ్చు. ఏదేమైనా పిల్లలకు తమ అవసరాలేమిటో తెలియడం, వాటికోసం తమంత తాము ఖర్చుచేసుకునే స్వేచ్ఛ ఉండటం, వ్యక్తిత్వ వికాసంలో ముఖ్యమైన భాగం. ఇంటివద్ద పరిస్థితులు ఏవైనా కానీ, బడిలో ఈ అవకాశాన్ని కల్పిస్తుంది డిబ్బీబ్యాంక్. ఒకటవ తరగతినుంచి పదవ తరగతి వరకు పిల్లలందరికీ ఈ అవకాశం ఉంది. ప్రాథమిక స్థాయి పిల్లలు రూ.80/-లు, ఆ పై తరగతుల వారు రూ.50/- లైబ్రరీలో జమ చేసి డిబ్బీబ్యాంకు ఖాతాను తెరుచుకోవచ్చు. అక్కడనుండి తమ పొదుపు ఖాతాను పెంచుకోవచ్చు.

మరి ఈ డబ్బులతో ఏమేం కొంటారు? బడిలో చేసే క్రాఫ్ట్‌వర్క్, ఆర్ట్‌వర్క్‌లకు కావలసిన సామగ్రిని ప్రాథమికంగా బడి సమకూరుస్తుంది. ఆపైన కొనసాగించ దల్చుకుంటే మరింత సామగ్రి అవసరం అవచ్చు. రంగుకాగితాలు, ఫెవికాల్, కార్డ్‌బోర్డుల వంటివి. వీటిని వారు బయట కొనుక్కోవాలి. బజారులో వీటిని చాలా ఎక్కువ రేట్లకు పిల్లలు కొనుక్కోవలసి వస్తుంది. కాబట్టి సరైన ధరకు బడిలోనే కొనుక్కొనే సదుపాయం కల్పించాం. లైబ్రరీలోనే అవి అందుబాటులో ఉంటాయి. అవేకాక

రోజువారీ అవసరమయ్యే స్టేషనరీ (పుస్తకాలు తప్ప) కూడా కొనుక్కోవచ్చు. వారికి కావలసినవి కొనుక్కొని తమ ఖాతాలోంచి మినహాయించుకోవాలి. డబ్బు ఇచ్చి కొనుక్కోవడమనే వీలు లేదు.

## ఎన్నికలు - స్కూలు పార్లమెంట్




బడి నిర్వహణలో పిల్లలు కూడా భాగస్వాములే. బడి ఆవరణకు తరగతి గదులకు సంబంధించిన బాగోగులు, పరిశుభ్రత బాధ్యత అంతా పిల్లలదే. దానిని సక్రమంగా నిర్వర్తించాలంటే పని విభజన, కొంతమంది లీడర్ల అవసరం ఉంటుంది. స్కూలు ప్యూపుల్ లీడర్ మరియు అసిస్టెంట్ స్కూల్ ప్యూపుల్ లీడర్‌లు డెమోక్రటిక్ పద్ధతిలో ఎన్నుకోబడతారు. ఎస్.పి.ఎల్.కు పదవ తరగతినుంచి, ఎ.ఎస్.పి.ఎల్.కు తొమ్మిదవ తరగతినుంచి పోటీచేస్తారు. వారికి ఎన్నికల గుర్తులు ఇవ్వబడతాయి. ప్రచారం కూడా చేసుకుంటారు. ఆరు ఆ పై తరగతుల పిల్లలు, టీచర్లు సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఓటు చేస్తారు. ఓట్లని లెక్కించాక మెజారిటీని బట్టి లీడర్లు నిర్ణయించబడతారు. ప్రమాణస్వీకారం చేసిన దగ్గరనుంచి ఆయా పనులు జరిగేలా చూడడానికి వారు బాధ్యత వహిస్తారు.

సంవత్సరంలో మూడు సార్లు టీచర్లు, లీడర్లు, మిగిలిన పిల్లలు కలిసి స్కూలు పార్లమెంటు నిర్వహించి సమస్యలను, చెయ్యవలసిన పనులను చర్చించుకుంటారు.

**అభ్యాస కుటుంబం**

పిల్లలు, టీచర్లు, యాజమాన్యం – వీళ్ళ మధ్య సంబంధాలు అభ్యాస విద్యాలయానికి వెన్నెముకలాంటివి. మా ఉనికి, గమనంలో అందర్నీ ఒక కుటుంబంలా కలిపి ఉంచే ఆత్మీయ సంబంధం అత్యంత ఉన్నతమైన పాత్ర పోషిస్తుంది.



పిల్లల వికాసానికి సంబంధించిన అన్ని విషయాలలో యాజమాన్యం తండ్రి పాత్ర పోషిస్తే, పిల్లలకు టీచర్లవద్ద అమ్మతో ఉండే దగ్గరతనం ఉందంటే అతిశయోక్తి కాదు. బడి స్థాపించినది మొదలు మాతో ఉన్నవారు కొందరు, పది సంవత్సరాలు పైబడి ఉన్నవారు చాలామంది. రెండు మూడు సంవత్సరాల క్రితం మాతో చేరిన వారు కొందరు.

విద్య, పిల్లల వికాసం విషయాలలో యాజమాన్యానికి, టీచర్లకు సారూప్యమైన భావజాలం, విలువలు ఉన్నట్లయితేనే ఇటువంటి సంబంధాలుండటానికి, సుదీర్ఘంగా కలిసి ప్రయాణం చేసేందుకు సాధ్యమవుతుంది. ఉన్నత విద్యార్హతలు, అనుభవం, తమ సబ్జెక్టులపై పట్టు, బోధనా నైపుణ్యాలతో పాటు, పిల్లలంటే ప్రేమ ఉండే టీచర్లు మాకు బలం. ఆర్థికపరంగా మెరుగైన అవకాశాలు లభించే అవకాశం ఉన్నప్పటికీ బడితోనూ, పిల్లలతోనూ ఏర్పడిన అనుబంధం వారికి ఎక్కువ విలువైనదిగా అనిపించడం అరుదైన విషయం.

**కలిసిమాట్లాడుకుందాం**

తమ పిల్లల గురించి తల్లితండ్రులు టీచర్లతో మాట్లాడవలసివస్తే ఏ రోజైనా సాయంత్రం 4 గంటల నుండి 4.30 గంటల వరకు రావచ్చు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడాలంటే ఉ.9.30గంటల నుండి 11గంటల మధ్య ముందుగా ఫోన్ చేసి రావచ్చు. సంవత్సరంలో రెండు సార్లు తల్లితండ్రుల సమావేశం జరుగుతుంది. దీనిని

కలిసి మాట్లాడుకుందాం అని ఎందుకు అన్నారంటే, ఆ రోజు తల్లితండ్రులు ప్రతి టీచర్‌తోనూ తమ పిల్లల గురించి విస్తారంగా మాట్లాడుకోవచ్చు. పిల్లలకు ఆరోజు శెలవు. ఉదయం 9.30 నుండి సాయంత్రం 3.30 మధ్యలో ఎప్పుడైనా రావచ్చు. ఒక్కో గదిలో ఒక్కోసబ్జెక్టు టీచర్ ఉంటారు. తల్లితండ్రులు ఆ టీచర్ మాత్రమే ఉంటారు కాబట్టి, ఎటువంటి సమస్యల గురించైనా టీచర్‌గాని, తల్లితండ్రులు గాని నిస్సంకోచంగా మాట్లాడుకొనే అవకాశం ఉంటుంది. అందరు టీచర్లతో మాట్లాడిన తర్వాత ప్రిన్సిపాల్‌తో కూడా మాట్లాడతారు. సుదీర్ఘంగా, వ్యక్తిగతంగా సాగే ఈ సమావేశంలో పిల్లల వ్యక్తిగత, మానసిక, భావోద్వేగ, ఆరోగ్య సమస్యలు, చదువులో వారి ప్రగతి వివరంగా మాట్లాడుకుంటారు. సలహాలు, సూచనలు ఇచ్చుకుంటారు. మంచి విషయాలు సంతోషంగా పంచుకుంటారు.

**సందడి**



పిల్లలలో దాగివుండే సృజనాత్మకతను, నైపుణ్యాలను పతాకస్థాయిలో ఆవిష్కరించే కార్యక్రమమే అభ్యాస విద్యాలయం వార్షికోత్సవ **'సందడి'**. మూడు గంటల పాటు సాగే ఒక అద్భుత కళావిన్యాసం. పిల్లలందరికీ అత్యంత ఇష్టమైన, అందరికీ పాల్గొనే అవకాశం ఉన్న ఈ కార్యక్రమంలో పాటలు, నృత్యాలు, నాటకాలు, పప్పెట్రీ వంటివి ఉంటాయి. ఈ కార్యక్రమం యొక్క ముఖ్యమైన ఉద్దేశం పిల్లల కళానైపుణ్యాల ప్రదర్శన అయినప్పటికీ అంతే ముఖ్యమైన ఎన్నో ఇతర ప్రయోజనాల దృష్ట్యా ఇది ఒక విశిష్ఠమైన, విశేషమైన కార్యక్రమం అని మా నమ్మకం.

అభ్యాస విద్యాలయంలో ప్రతిరోజూ ఉండే సృజనోదయం మొదలుకొని సందడి వరకు సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రదర్శించే అంశాలు ఖచ్చితమైన నిబంధనలకు లోబడి ఎంపిక చేయబడతాయి. ఇటువంటివి ప్రదర్శనకు సరైనవి అన్న అవగాహన బడిలో ఎన్నో ఏళ్ళుగా ఒకేలా ఉంది. అది పిల్లలు, టీచర్లు, యాజమాన్యం – అందరికీ ఒకేలా ఉంటుంది.



పాటలైనా, నృత్యాలైనా, నాటికలైనా ప్రస్తుత సినిమా ధోరణులను, వాటి వాసనలను ఏమాత్రం కలిగిఉండవు. ఒక మంచి సంస్కృతిని – అది ఏ ప్రాంతం, ఏ దేశానికి చెందినదైనా సరే – ప్రతిబింబించేవిగా ఉంటాయి. పాటలు సాధారణంగా లలిత, జానపద, దేశభక్తి గీతాలై ఉంటాయి. వినసొంపుగా, పిల్లలు ఇష్టంగా, సులువుగా పాడేలా ఉంటాయి. మంచి అర్థం కలిగి ఉండటం, అది పిల్లలకు తెలిసి ఉండటం ముఖ్యం.

అనేక నృత్యరీతులు సేకరించి, పిల్లలకు వాటిని చూపించి, వాళ్ళు ఇష్టపడిన దానిని వాళ్ళు ఎంచుకోవడం జరుగుతుంది. ఆ నృత్యరీతి యొక్క వివరాలను తెలుసుకుంటారు. ఆ తర్వాత సాధన మొదలుపెడతారు. ప్రత్యేకించి టీచరు ఉండరు. సమయం వెచ్చించగలిగే పూర్వ విద్యార్థులో, పెద్ద తరగతులలో సామర్థ్యం ఉన్న పిల్లలో నేర్పిస్తారు. ఒక సంస్కృతికి, సంప్రదాయానికి సంబంధించిన నృత్యమైనప్పుడు దానికి తగ్గ ఆహార్యం కూడా తప్పనిసరి. జపాన్ నృత్యం వేస్తే –

వారిలా... ఆటవికుల నృత్యం వేస్తే – వారిలా... ఏ నృత్యం చేస్తే వారిలా కనపడాలంటే ఎన్నో అవసరమవుతాయి. అభ్యాస విద్యాలయంలో బట్టలు (అవి బడిలో తయారుచేయలేరు కాబట్టి) తప్ప మరేదీ కొనకూడదనే నియమం ఉంది. ఏదైనా తయారుచేసుకోవాల్సిందే! ఈకలు, కిరీటాలు, గాజులు, ముక్కుపుడకలు, గొలుసులు...ఇలా అన్ని నగలు, మాస్కులు, డప్పులు. పల్లకీ, పడవ, గొడుగులు, ఇల్లు, ఎద్దు... ఇలా ఎంత భారీదైనా తయారుచేయడమే! రెండు దశాబ్దాలుగా ఈ సంస్కృతి బడిలో స్థిరపడిపోవడంతో పిల్లలెవరికీ 'ఇది కష్టమేమో, అద్దెకు తెచ్చుకుంటే పోలా!' అన్న ఆలోచనే రాదు.

గొలుసులు, గాజులు లాంటి నగల విషయంలోనైతే మూడవ తరగతి పిల్లలకు కూడా ఎవరి సహాయం అవసరం లేదు. అలవోకగా, సునాయాసంగా చేసేస్తారు. పెద్ద వస్తువులు, కొత్తగా ఆలోచించాల్సివచ్చే సవాళ్ళకు మాత్రం ప్రిన్సిపాల్, పాత విద్యార్థులు, టీచర్ల మధ్య ఆలోచనలు, సలహాలు ఇచ్చిపుచ్చుకోవడం, చర్చలు జరుగుతాయి. వీటిని తయారుచేయడం అనే ప్రక్రియ మొత్తం ఓ పెద్ద ప్రాజెక్టు. కొన్ని ఆలోచనలు మొదటి ప్రయత్నంలోనే విజయవంతమవుతాయి. అనుకున్న వస్తువు అనుకున్నట్లుగా తయారైపోతుంది. కొన్ని సవాళ్ళు చాలా కష్టంగా ఉంటాయి. ఒక్కో సారి మూడు, నాలుగు సార్లు కూడా విఫలమైపోతాయి. ఆ విఫలప్రయత్నాల నుండి ఎన్నో సులువైన టెక్నిక్‌లను కనిపెట్టి, గొప్ప విజయాన్ని సాధించిన సంతోషం పొందిన సందర్భాలు లెక్కలేనన్ని. అయ్యో! దీని గురించి ఇంత కష్టపడ్డామా? అని వారికివారే నవ్వుకుంటారు. ఎంతో గర్విస్తారు.

18 అడుగుల భారీ డ్రాగన్‌ను బట్టలతో తయారుచేయడం, కథకళి ఆహార్యాన్ని కిరీటం, బట్టలతో సహా, మేకప్‌మాన్ అవసరం లేకుండా తయారుచేసుకోవడం, కారీబాగ్ గుడ్డతో పిల్లలకు గౌన్‌లు తయారుచేయడం... ఇవన్నీ నైపుణ్యాలకు ప్రతీకలు. సరైన మార్గదర్శకత్వం ఉంటే ఎంతటి పనులు, ఎంతటి పరిపూర్ణతతో చేయగలరో తెలియచెప్పే ఉదాహరణలు.

ఇక నాటికల విషయానికొస్తే మనసారా నవ్వుకునే ఆరోగ్యకరమైన హాస్యనాటికలు,

లేదా వ్యంగ్య సందేశాత్మక నాటికలు ఉంటాయి. పకడ్బందీగా సాధనచేసి, ఎటువంటి ప్రాంప్టింగ్, తడబాటు లేకుండా నటించి వీళ్ళు పిల్లలా, పిడుగులా అనిపించుకున్నారు పలుమార్లు.

ఇదికాక పిల్లలు తామే తయారుచేసిన పప్పెట్లతో షాడోపప్పెట్రీ, పిల్లలే తెర వెనుక నిలబడి చేసే షాడోషోల వంటివి కూడా చేసి అబ్బురపరిచారు. పిల్లలోని బెరుకునుపోగొట్టి, నైపుణ్యాలను పెంచి, ఆత్మవిశ్వాసాన్ని, వెలకట్టలేని సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చే 'సందడి' పిల్లల సమగ్రవికాసానికి దోహదపడే ఓ మంచి కార్యక్రమం. పిల్లలకు ఎన్నటికీ ఓ గొప్ప తీపిజ్ఞాపకం.

**అభ్యాస విద్యాలయంలో ఏది ఉండదు? :**

♦ బాగా చదువుతారనే నెపంతో పిల్లలను పోల్చడం

♦ అసూయను పెంచే పోటీలు, ర్యాంకులు

♦ మానసికంగా, శారీరకంగా బాధించడం, శిక్షించడం

♦ పిల్లలను కించపరిచే లేదా నిరుత్సాహపరిచే 'నువ్వింతే' లాంటి ముద్రలు వేయడం

♦ మార్కులకోసం బట్టీ పద్ధతులను ప్రోత్సహించడం

♦ టెక్ట్స్ బుక్స్ చదివి సొంతంగా రాయడం వల్ల తప్పులొస్తాయని, స్టడీ మెటీరియల్స్ చదివించడం

పిల్లల బాల్యం సంతోషంగా గడపడానికి, సహజసిద్ధమైన శక్తులను పెంపొందించుకోవడానికి, అర్థవంతమైన జ్ఞానసముపార్జనకి, జీవితంలో అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడానికి అభ్యాస విద్యాలయం వేదిక కావాలన్నది మా ఆశ... ఆశయం... అందుకే మా నిరంతర కృషి.

ఈ పుస్తకంలో వివరించిన విషయాలను దృశ్యరూపంలో చూడాలనుకుంటే
ఈ క్రింది ఫేస్‌బుక్ పేజ్‌ను సందర్శించండి :
http://www.facebook.com/abhyasavidyalayam

అభ్యాసవిద్యాలయం
విజయవాడ